thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 38 | జగిత్యాల | మంగళవారం | 28 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ఢిల్లీ డీలా.. బెంగళూరు బల్లే బల్లే



11

# రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

ధాన్యం కొనే దిక్కులేకుండా పోయింది



- బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం
- ఒక్కరు కూడా ఎదిరించి మాట్లాడలేక పోయారు
- బీఆర్ఎస్ ఎంపీలుంటే రణరంగం సృష్టించేవారు
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు..అది నా చిత్తశుద్ధి అని కేసీఆర్ అన్నారు.బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు.

మిగతా 2 లో

## బీఆర్ఎస్ సంస్థాగత ప్రక్షాళన

- అన్ని స్థాయిల కమిటీల రద్దుకు కేసీఆర్ ఆదేశం!
- కేటీఆర్‌కు కీలక బాధ్యతలు..
- త్వరలోనే కొత్త కమిటీల నియామకం







## మహిళల భద్రతకు పెద్దపీట

చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం | డ్రగ్స్‌పై ఉక్కుపాదం

- మహిళలను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపాం
- మహిళాభివృద్ధికి తెలంగాణ బ్రాండ్ కావాలి
- గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నాం
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు
- అన్నిరంగాల్లో మహిళా రిజర్వేషన్ల కాంగ్రెస్ ఘనతే
- స్పందన బృందాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 27 :** అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు, చిన్నారుల రక్షణకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఏ నగరంలో వీరికి భద్రత ఉంటుందో అక్కడ అభివృద్ధి వేగంగా జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్పందన' బృందాలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మహిళలకు తక్షణ రక్షణ, మానసిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ బృందాలు పనిచేస్తాయని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేస్తోందని, గతంలో షీ టీమ్స్ ఉంటే ఇప్పుడు 'స్టాండ్ విత్ హర్' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా వారికి అండగా నిలుస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. కేవలం చట్టాలు చేయడం మాత్రమే కాకుండా, సమస్య అసలు తలెత్తకుండా చూడాల్సిన సామాజిక బాధ్యత అందరిపైనా ఉందని ఆయన ఉద్ఘాటించారు.

మిగతా 2 లో



## బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ లేదు

- కవిత పార్టీ కుటుంబ గూడుపుఠాణి
- కేసీఆర్ చావాలని ఎప్పుడూ కోరుకోలేదు
- కాళేశ్వరంపై సీబీఐ విచారణ తరవాతే చర్యలు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

3



## ఎమ్మెల్సీల ప్రమాణం

2

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కోదండరామ్, అజారుద్దీన్‌తో ప్రమాణం చేయించిన మండలి ఛైర్మన్ గుత్తా

## బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ

3

బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలంతా కలసి రావాలని పిలుపు

## మహాలింగాపురంలో కూలిన భారీ క్రేన్

ఐదుగురు కార్మికుల దుర్మరణం
ఎన్‌సీసీ సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో విషాదం..
మరో 12 మందికి తీవ్ర గాయాలు
ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి..

3



## బిర్యానీ, పుచ్చకాయ తిని..



ఫుడ్ పాయిజనింగ్‌తో కుటుంబలో నలుగురు మృత్యువాత
ముంబైలో విషాద ఘటన

.. వివరాలు 4లో

మహారాష్ట్రలోని ఓ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బంధువులతో కలిసి బిర్యానీ, పుచ్చకాయ తిని కొన్ని గంటల్లోనే తీవ్ర అస్వస్థతకు గురై.. 12 గంటల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు.

## త్వరలో సర్ ప్రక్రియ



2002 జాబితాతో వివరాల సరిపోలిక..
అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కే లక్ష్యం
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

త్వరలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడేందుకు, అక్రమాలను తొలగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

2

ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి

## రాజముద్ర

వీరంతా బీజేపీలో చేరినట్లుగా గుర్తించిన ఛైర్మన్
రాజ్యసభలో 113కు చేరిన బీజేపీ సంఖ్యాబలం

4





## సీనియర్ పాత్రికేయుడు మధుసూదన్ మృతి

సీఎం రేవంత్, భట్టి తీవ్ర సంతాపం

.. వివరాలు 2లో



# ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్ ప్రమాణం

## ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా

## హాజరైన సీఎం రేవంత్ తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణ–స్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని వ్యాఖ్యానించారు. పదవులు అనేవి శాశ్వతం కాదని స్పష్టం చేశారు. ఒకాయన తాను పోరాడాతానా లేదా అని అన్నారని.. తాను పోరాడి చూపిస్తానని చెప్పుకొచ్చారు. గతంలో తనపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన తన పని ఆగలేదని.. కొనసాగుతోందని స్పష్టం చేశారు. వివాదాస్పద సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు. లక్ష్యాలను ఎంచుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యమకారుల సమస్యలు, ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు చేస్తున్న పనిని సమర్థవంతంగా పూర్తి చేయడానికి తనకు ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం ముందుకు పోతానని తెలిపారు. గతంలో ఏ రకంగా తన జీవన శైలి ఉందో.. భవిష్యత్తులో కూడా అదేవిధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడతానని.. వారికి ఎప్పుడు అందుబాటులో ఉంటానని కోదండరాం పేర్కొన్నారు మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, మంత్రి మండలికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయి. అన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగాలి. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే మంత్రి పదవి ఇచ్చారనేది వాస్తవం కాదు. సీఎం రేవంత్‌రెడ్డి మొదట్నుంచీ మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదింపు

## రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం రెండో టెర్మినల్‌కు సోమవారం బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందిన వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు టెర్మినల్ అంతటా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ తనిఖీల తర్వాత ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఇది ఫేక్ ఈ –మెయిల్ అని నిర్ధారించారు. బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. మెయిల్ సోర్స్, ఐపీ అడ్రస్ తదితర వివరాలను ట్రాక్ చేసే పనిలో ఉన్నారు. తనిఖీల సమయంలో కాసేపు విమానాశ్రయంలో భద్రతా జాగ్రత్తలు చేపట్టినప్పటికీ, సాధారణ విమాన సేవలకు పెద్ద అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు. ఇది ఫేక్ ఈ –మెయిల్ అని తేలడంతో విమానాశ్రయ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# సీనియర్ పాత్రికేయుడు మధుసూధన్ మృతి

## సీఎం రేవంత్, భట్టి తీవ్ర సంతాపం

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మారబోయిన మధుసూదన్ గుండెపోటుతో మృతి చెందారు. అపోలో స్పెక్ట్రా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి సంస్థల్లో ఆయన సీనియర్ జర్నలిస్టుగా కీలక బాధ్యతలను నిర్వర్తించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మధుసూదన్ మృతి పట్ల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిజాయతీ గల పాత్రికేయుడిని కోల్పోవడం బాధాకరంగా ఉందన్నారు. మధు–సూదన్ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన హఠాన్మరణం తీవ్రంగా కలచివేసిందన్నారు. సమాచార కమిషనర్ ముకుంద రెడ్డి కూడా సంతాపం ప్రకటించారు.

# మెదక్ జిల్లాలో ట్రావెల్ బస్సు దగ్గం

**మెదక్, ఏప్రిల్ 27:** మెదక్ జిల్లాలోని మాసాయిపేట వద్ద ఎన్‌హెచ్ –44పై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. ఈ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తూ డ్రైవర్, క్లీనర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో సాంకేతిక సమస్య తలెత్తడంతో, దానిని రిపేర్ చేయించడం కోసం హైదరాబాద్ నుంచి మెదక్ తీసుకువచ్చారు. రిపేర్ పనులు పూర్తయిన తర్వాత సోమవారం తెల్లవారుజామున డ్రైవర్, క్లీనర్ బస్సును తీసుకుని తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. మాసాయిపేట పరిసర ప్రాంతాల్లో ప్రయాణిస్తుండగా, బస్సు ఇంజిన్ భాగం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. మంటలు నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తానికి వ్యాపించాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో డ్రైవర్, క్లీనర్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా బస్సులో నుంచి కిందకు దూకేశారు. దీంతో వారు క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు గంటసేపు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే, అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయా? లేదా రిపేర్ పనుల్లో ఏవైనా లోపాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

# మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

మొదటి పేజీ తరువాయి

మహిళా సాధికారత కేవలం మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయడమే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 60 వేల కోట్ల బ్యాంక్ రుణాలను అందజేశామని, ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరుతోనే ఇస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన వచ్చినప్పుడే కుటుంబం, సమాజం నిలబడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహాలక్ష్మి పథకం ద్వారా చేపట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల రాష్ట్రంలోని ఆడబిడ్డలు ఇప్పటివరకు రూ. 10 వేల కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. మహిళా సంఘాలను పారిశ్రామిక వేత్తలుగా మార్చే క్రమంలో వారికి సోలార్ ఎనర్జీ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ క్యాంటీన్లు మరియు ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంలు కుట్టే బాధ్యతలను అప్పగించినట్లు వివరించారు. అమెజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్ కల్పిస్తున్నామని చెప్పారు.




## డ్రగ్స్ విషయంలో దయాదాక్షిణ్యాలు లేవు

రాష్ట్ర భవిష్యత్తును పాడు చేస్తున్న గంజాయి, డ్రగ్స్ సంస్కృతిపై సీఎం తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. వ్యసనాల బారిన పడిన వారే మహిళలు, చిన్నారులపై అకృత్యాలకు పాల్పడుతున్నారని, అందుకే 'ఈగల్ ఫోర్స్' ద్వారా డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. ఈ విషయంలో ఎంతటి వారున్నా, సెలబ్రిటీలైనా, ప్రజాప్రతినిధులైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఇప్పటికే కొందరిని అరెస్టు కూడా చేశామని గుర్తు చేశారు. పంజాబ్ రాష్ట్రం డ్రగ్స్ వల్ల ఏ విధంగా నిర్వీర్యమైందో మన కళ్లముందే ఉందని, తెలంగాణకు ఆ పరిస్థితి రానివ్వబోమని ధీమా వ్యక్తం చేశారు. పాఠశాలల్లో చేరే సమయంలోనే విద్యార్థుల నుంచి డ్రగ్స్ తీసుకోబోమని సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకునేలా చర్యలు చేపడుతున్నామని, పీస్ కమిటీలు కూడా ఇకపై డ్రగ్స్ నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు.

## భవిష్యత్ లక్ష్యాలపై దిశానిర్దేశం

2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇది సాధ్యం కావాలంటే మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలని సీఎం పిలుపునిచ్చారు. రాజ్యాంగబద్ధంగా మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, స్థానిక సంస్థల నుంచి పార్లమెంటు వరకు మహిళా ప్రాతినిధ్యం పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డీజీపీ శివప్రసాద్ రెడ్డి, నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ లేదు

## కవిత పార్టీ కుటుంబ గూడుపుఠాణి

## కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలనే కోరుకుంటా

## ఆయన చావాలని తానెప్పుడూ కోరుకోలేదు

## కాళేశ్వరంపై సీబీఐ విచారణ తరవాతే చర్యలు

## మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** బీఆర్ఎస్ పార్టీకి కేవలం గతం మాత్రమే ఉందని, ఆ పార్టీకి భవిష్యత్తు లేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, కేసీఆర్ కుటుంబంపై, ఆ పార్టీ మనుగడపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబమంతా ఒక్కటేనని, బయటకు మాత్రం తెచ్చిపెట్టుకున్న నటనను ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న పదేళ్లు ప్రజలతో సంబంధం లేకుండా పాలన సాగించారని, అందుకే ప్రజలు వారిని పక్కన పెట్టారని అన్నారు. కవిత కొత్త పార్టీ ఏర్పాటు వార్తలపై స్పందిస్తూ, ఇదంతా రాజకీయ డ్రామాలో భాగమేనని కొట్టిపారేశారు. కేసీఆర్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న ప్రజాప్రతినిధి అని, ఆయన ఆరోగ్యంగా ఉండటం రాజకీయంగా తమకే మంచిదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## వ్యక్తిగత వైరం లేదు.. రాజకీయ పోరాటమే

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యంపై తాను ఎప్పుడూ ప్రతికూలంగా ఆలోచించలేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు కేవలం రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, వ్యక్తిగత శత్రువు కాదని అన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉంటేనే రాజకీయంగా ఎదుర్కోవడం సులభమవుతుందని వ్యాఖ్యానించారు. గతంలో కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించానని, అసెంబ్లీలో కలిసినప్పుడు కూడా యోగక్షేమాలు అడిగానని గుర్తుచేశారు. అయితే, కేసీఆర్ కుటుంబ సభ్యులే ఆయనకు చెడు జరగాలని కోరుకుంటున్నారని, ఆయన బతికి ఉంటే తమకు అధికారం రాదని వారు భావిస్తున్నట్లు ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్‌ను ఆ కుర్చీలో కూర్చోబెట్టాలని మంత్రులతో ప్రకటనలు చేయించిన తీరును ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో హైకోర్టు తీర్పును ప్రభుత్వం తప్పుబట్టలేదని, కేవలం సాంకేతిక లోపాలున్నాయని మాత్రమే చెప్పిందని సీఎం వివరించారు. నివేదిక ఆధారంగా తొందరపడి చర్యలు తీసుకోవద్దని కోర్టు సూచించిందని, సీబీఐ విచారణ పూర్తికాగానే అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వివక్ష లేని పాలనను సాగిస్తోందని, ప్రతిపక్షమే లేని విధంగా ప్రజల మద్దతుతో ముందుకు వెళ్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను ఇప్పటికే రెండుసార్లు ఓడించానని, ఆయనకు ఓటమి కొత్త కాదని, అలాగే కాంగ్రెస్‌కు గెలుపు కొత్త కాదని వ్యాఖ్యానించారు. గతంలో మహేష్ గౌడ్ చేతిలో కేసీఆర్ ఓడిపోయిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

# పార్లమెంట్ తరహా అసెంబ్లీ ప్రాంగణం

## వచ్చే సెషన్ నాటికే సెంట్రల్ హాల్ సిద్ధం!

## పబ్లిక్ గార్డెన్‌లో సభ్యులకు క్లబ్, వాకింగ్ ట్రాక్..

## స్పీకర్, మండలి ఛైర్మన్‌తో సీఎం సమీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** అసెంబ్లీ ప్రాంగణం పార్లమెంట్ తరహాలో పనితీరు ఉండేలా అవసరమైన మార్పులు చేపట్టాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో చేపట్టాల్సిన పనులపైన శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ లతో సమిక్షా సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేసారు. ఈసందర్భంగా పార్లమెంట్ తరహా లో అసెంబ్లీ ప్రాంగణం ఉండాలని అభిప్రాయపడ్డారు. సభ గౌరవం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెంబర్స్ కి మరింత ప్రైవసీ ఉండాలన్నారు. పబ్లిక్ గార్డె లో మెంబర్స్ కోసం క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. మెంబర్స్ కోసం వాకింగ్ ట్రాక్,క్రీడల కోసం ఏర్పాట్లు ఉండాలన్నారు. వచ్చే సెషన్



నాటికి సెంట్రల్ హాల్ సిద్ధం కావాలని అన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో ఉండాలని సిఎం రేవంత్ గతంలోనే సూచనలు చేశారు. హెరిటేజ్ భవనాలకు నష్టం జరగకుండా చర్యలు ఉండాలని కూడా సూచించారు. అసెంబ్లీ ప్రాంగణం భద్రతని పటిష్టం చేయాలన్నారు.

# త్వరలోనే సర్ ప్రక్రియ

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం నిర్వహించనున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం త్వరలో విడుదల చేయనుంది. చట్టం ప్రకారం ఓటర్ల జాబితాను సవరించడానికి భారత ఎన్నికల సంఘానికి అధికారాలు ఉన్నాయి. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఎన్నికకు ముందు లేదా అవసరాన్ని బట్టి సవరణ చేయాలని కమిషన్ ఆదేశిస్తుంది. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో తరచూ జరిగే వలసల వల్ల ఓటర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేరు నమోదు చేసుకోవడం, మరణించిన ఓటర్ల పేర్లు తొలగించకపోవడం వల్ల పలు సమస్యలు ఏర్పడ్డాయన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం చేపట్టిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ఓటర్ల జాబితాలో నమోదైన ఓటర్ల వివరాలను 2002లో జరిగిన చివరి సవరణద్వారా ఉన్న వారి పేర్లు లేదా వారి బంధువుల పేర్లతో సరిపోల్చే ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఈ వివరాలను ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలో నమోదు చేయాలి. ఓటర్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ఎంపిక ద్వారా తెలుసుకోవచ్చు. పోలింగ్ స్టేషన్ వారీగా ఓటర్ల జాబితా రూపంలో కూడా అందుబాటులో ఉంది. తమ పోలింగ్ స్టేషన్ తెలిసిన వారు కూడా తమ పేర్లను తనిఖీ చేసుకోవచ్చు. ఇక ఓటరు పేరు 2002 ఎన్నికల జాబితాలో కనపడకపోతే, అతను/ఆమె ఆ సమయంలో నమోదు కాలేదని అర్థం. అటువంటి సందర్భంలో, వారి తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల వివరాలను వెతికి, వాటిని ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేసుకోవాలని సూచించారు. 2002 ఓటర్ల జాబితా ముద్రిత ప్రతులు బూత్



లెవెల్ ఆఫీసర్ వద్ద అందుబాటులో ఉంటాయని, వారు మీకు సహాయం చేస్తారని తెలిపారు. ఎన్యుమరేషన్ దశలో ఓటర్లు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. అయితే, 2002 జాబితాతో సరిపోల్చలేని ఓటర్లకు నోటీసులు జారీ చేయబడతాయన్నారు. వారి అర్హతను నిరూపించడానికి పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

# బిర్యానీ, పుచ్చకాయ తిని..

## ఫుడ్ పాయిజనింగ్‌తో కుటుంబంలో నలుగురు మృత్యువాత

## ముంబైలో విషాద ఘటన

**ముంబై, ఏప్రిల్27:** మహారాష్ట్రలోని ఓ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బంధువులతో కలిసి బిర్యానీ, పుచ్చకాయ తిని కొన్ని గంటల్లోనే తీవ్ర అస్వస్థతకు గురై.. 12 గంటల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో 13 ఏళ్ల బాలిక కూడా ఉంది. ఫుడ్ పాయిజనింగ్ జరగడంతో వీరు మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..



ముంబయి లోని పైధోనీలో అబ్దుల్లా అబ్దుల్ కాదర్ (40)

మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నారు. అతడి భార్య నస్రీన్ (35). ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. శనివారం రాత్రి బంధువులు నిర్వహించిన విందులో అబ్దుల్లా కుటుంబం పాల్గొనింది. అక్కడ బిర్యానీ తిన్నారు. అనంతరం ఇంటికి చేరుకున్నాక అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పుచ్చకాయ తిన్నారు. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో ఆ కుటుంబంలోని అందరికీ వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వెంటనే అబ్దుల్లా స్థానికంగా ఉన్న డాక్టర్‌ని పిలిచారు. కానీ, అప్పటికే వారి పరిస్థితి విషమంగా మారింది. దీంతో కుటుంబాన్ని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల సమయంలో నలుగురూ మృతిచెందారు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. ఫుడ్ పాయిజనింగ్ కారణం అయ్యుండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

చురకలు
మంగళవారం 28 ఏప్రిల్ 2026



# రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

**ధాన్యం కొనే దిక్కులేకుండా పోయింది**

**బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం**

**ఒక్కరు కూడా ఎదిరించి మాట్లాడలేక పోయారు**

**బీఆర్ఎస్ ఎంపీలుంటే రణరంగం సృష్టించేవారు**

**తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**

**హైదరాబాద్, ఏప్రిల్ 27:** రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు..అది నా చిత్తశుద్ధి అని కేసీఆర్ అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఈ 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని నిలదీశారు. అదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించేటోళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండి పౌరుషంగా లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టామని కేసీఆర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం భూముల కబ్జాల్లో నంబర్‌వన్, కూలగొట్టడంలో నంబర్‌వన్‌గా నిలబెట్టే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో చేతకానితనంతో ఉన్నదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం వల్ల రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ అవుతుందని అన్నారు. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందని అన్నారు. ఇక ఈ అంతర్గత సమావేశంలోనే జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యవర్గానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు.

## బీఆర్ఎస్ సంస్థాగత ప్రక్షాళన

**అన్ని స్థాయిల కమిటీల రద్దుకు కేసీఆర్ ఆదేశం!**

**కేటీఆర్‌కు కీలక బాధ్యతలు..**

**త్వరలోనే కొత్త కమిటీల నియామకం**

**హైదరాబాద్, ఏప్రిల్27 :** భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణానికి సంబంధించి ఆయన సంచలన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ రాష్ట్ర స్థాయి కార్యవర్గం మినహా, ప్రస్తుతం ఉన్న అన్ని స్థాయిల కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీని మరింత చైతన్యవంతం చేసేందుకు మరియు నూతన నాయకత్వానికి అవకాశం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. త్వరలోనే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని విభాగాలకు కొత్త కమిటీలను నియమించాలని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. పార్టీ పునర్నిర్మాణం, కమిటీల నియామక ప్రక్రియలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కేసీఆర్ అత్యంత కీలక బాధ్యతలను అప్పగించారు. కొత్తగా నియామకమయ్యే కమిటీ సభ్యులు, నాయకులకు పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ శిబిరాల బాధ్యతను కూడా కేటీఆర్ పర్యవేక్షించనున్నారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా శిక్షణా కార్యక్రమాల రూపకల్పన ఉండాలని,



నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా తరగతులు నిర్వహించాలని కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

**డిజిటల్ సభ్యత్వ నమోదు**

పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని కేసీఆర్ స్పష్టం చేశారు. ఈసారి సభ్యత్వ నమోదు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో నిర్వహించాలని ఆదేశించారు. సభ్యులు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునేలా డిజిటల్ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పార్టీ కేడర్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయడం ద్వారా కమ్యూనికేషన్ వేగంగా జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయాలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

## ప్రతి కుటుంబం వివరాలు నమోదు చేసుకోవాలి

**జనగణనలో డిప్యూటీ సీఎం భట్టి**

**ఖమ్మం, ఏప్రిల్ 27:** రాష్ట్రంలోని ప్రజలందరు జనగణనలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజలంతా తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఈ పక్రియను పూర్తి చేశారు. ఈ విధానం ద్వారా జనగణనలో సమాచార సేకరణ సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో జనగణన 2027 పక్రియలో భాగంగా, ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు సరిగ్గా అందుతాయని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, టెక్నీకల్ అసిస్టెంట్ హిమవర్ష తదితరులు పాల్గొన్నారు.



## బెంగాల్ ప్రచారం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది

**బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు కలసి రావాలి**

**బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ప్రచారానికి సోమవారం సాయంత్రం తెరపడటంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో తాను జరిపిన విస్తృత పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మిక ఎదుగుదల పరంగా తనకెంతో ఉపకరించిందని ఆ లేఖలో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్రాభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను రాష్ట్ర ప్రజల ముందు ఉంచానని, అయినప్పటికీ ఈ లేఖ ద్వారా తన మనోభావాలని రాష్ట్ర ప్రజలందరితోనూ పంచుకోవాలని అనుకుంటున్నానని చెప్పారు. బెంగాల్ సోదర, సోదరీమణుల్లారా అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో అసాధారణ శక్తిని తాను అనుభూతి పొందానని, తీవ్రమైన వేడి, వరుస ర్యాలీల్లో పాల్గొన్నప్పటికీ తనకెలాంటి అలసట రాలేదని చెప్పారు. 'ఈ ర్యాలీలు, రోడ్‌షోలు నాకొక యాత్రలాంటి అనుభూతినిచ్చింది. మా కాళి భక్తులతో కలిసి నేను ఎప్పుడు వెళ్లినా ఆ తల్లి నాలో రెట్టించిన



శక్తిని నింపుతున్నట్టు అనిపిస్తుంది. 2024 జనవరిలో అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన జరిగిన 11 రోజులు ఉపవాసం చేశాను. అప్పటిలాగా బెంగాల్ ప్రచారంలో కూడా అలాంటి ఆధ్యాత్మిక అనుభూతే నాకు కలిగింది' అని మోదీ వెల్లడించారు. బెంగాల్‌లో పాల్గొన్న ర్యాలీలు, రోడ్‌షోలలో ప్రజల నుంచి హృదయాన్ని కదలించే ఎన్నో మెసేజ్‌లు, ఫోటోలు తనకు అందాయని, వాటిని ఎప్పటికీ మరచిపోలేనని మోదీ తెలిపారు. ఎంత అర్ధరాత్రయినవీలు చూసుకుని వాటిని చదవడంతో పాటు స్పందిస్తుంటానని చెప్పారు. యువకులు, మహిళలు, ఆడకూతుళ్లు, పెద్దలు సహా అన్ని వయస్సుల వారు చూపిస్తున్న ఆదరణ మరువలేనని, వారే తనకు అత్యంత విలువైన సంపద అని అభివర్ణించారు. బెంగాల్ సత్వర అభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్న విషయం తాను గ్రహించానని, యువత ప్రగతిపథం వైపు దూసుకువెళ్లే అవకాశాల కోసం, ఆడకూతుళ్ల ఆకాశమే హద్దుగా అవకాశాలు అందిపుచ్చుకోవడం, భద్రత కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రజలంతా మార్పు కావాలనే ఏకైక సంకల్పంతో ఉన్నారని చెప్పారు. ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని తెలిపారు. సురక్షిత బెంగాల్‌కు తాను బాధ్యత తీసుకుంటానని, సవాళ్లను అవకాశాలుగా మార్చేందుకు తాను కృతనిశ్చయంతో ఉన్నానని చెప్పారు. 'రాష్ట్రంలో బీజేపే ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి ప్రజలంతా కలిసివస్తారనే నమ్మకం నాకుంది. మనమంతా కలిసి అభివృద్ధి చెందిన బెంగాల్‌ను నిర్మించుకుందాం' అంటూ ప్రధాని ఆ లేఖను ముగించారు.



## మహాలింగాపురంలో కూలిన భారీ క్రేన్

**ఐదుగురు కార్మికుల దుర్మరణం**

**ఎన్‌సీసీ సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో విషాదం..**

**మరో 12 మందికి తీవ్ర గాయాలు**

**ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి..**

**శంకరపల్లి:** రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం మహాలింగాపురంలో సోమవారం ఘోర ప్రమాదం సంభవించింది. స్థానిక ఎన్‌సీసీ సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో పనులు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ క్రేన్ కూలిపోవడంతో ఐదుగురు కార్మికులు మృత్యువాత పడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిథున్ అనే కార్మికుడు పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో ఈ ఘటనలో మొత్తం మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది. మృతులను అలీ హుస్సేన్ (35), నాగేంద్ర (30), సాజిద్ (32), మిథున్ మరియు సోనుగా గుర్తించారు. ఈ ప్రమాద సమయంలో అక్కడ మొత్తం 17 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. క్రేన్ కూలిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు భయాందోళనలకు గురయ్యారు. భారీ యంత్రం ఒక్కసారిగా కార్మికులపై పడటంతో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే శంకరపల్లిలోని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నట్లు సమాచారం. ప్రమాద ధాటికి క్రేన్ భాగాలు తునాతునకలయ్యాయని, సహాయక చర్యలు చేపట్టే సమయానికి కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు**

ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. కంపెనీలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందా? లేదా సాంకేతిక లోపం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాద సమయంలో అక్కడ పనిచేస్తున్న ఇతర కార్మికుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కాయకష్టమే నమ్ముకుని వచ్చిన కార్మికులు ఇలా ప్రమాదానికి గురై మరణించడం వారి కుటుంబాల్లో తీరని వేదనను మిగిల్చింది.

## బ్రేక్ అప్ తరవాత అత్యాచార కేసులు కుదరవు

**తేల్చి చెప్పిన సుప్రీం ధర్మాసనం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** సహజీవనం తర్వాత అత్యాచారం కేసులు పెట్టడం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. బ్రేక్-అప్ తర్వాత లైంగిక దాడి ఆరోపణలు వర్తించవని పేర్కొంది. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం నేరం కిందకు రాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. పెళ్లి చేసుకోలేదని కక్షపూరితంగా కేసులు పెట్టడం సరికాదని ధర్మాసనం సూచించింది. తప్పుడు వాగ్దానం, విఫలమైన వాగ్దానాల మధ్య తేడాను గుర్తించాలని కేసు విచారణ సందర్భంగా పిటిషనర్‌కు తెలిపింది. ఈ మేరకు మహారాష్ట్ర న్యాయవాదిపై నమోదైన అత్యాచారం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇద్దరి వ్యక్తుల బంధంలో ప్రారంభం నుంచీ మోసపూరిత ఉద్దేశం ఉంటేనే నేరం కిందకు వస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

## అంబర్‌పేట చౌరస్తాలో భారీ అగ్నిప్రమాదం

**దగ్ధమైన రెండు కారు షోరూమ్‌లు**



**హైదరాబాద్, ఏప్రిల్ 27:** అంబర్‌పేట్ చౌరస్తాలోని రెనో, మహీంద్ర షోరూమ్స్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. ప్రమాదాన్ని పసిగట్టిన వెంటనే షోరూమ్ యజమానులు.. అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది.. మంటలార్పుతున్నారు. ప్రమాదానికి గురైన షోరూమ్స్ వెనుక వైపు గృహసముదాయాలు ఉన్నాయి. అగ్నికీలలు ఎగసిపడుతుండటం, ప్రమాద తీవ్రత అధికంగా ఉండటంతో.. షోరూమ్స్‌కి ఆనుకుని ఉన్న ఇళ్లలోని ప్రజలను పోలీసులు ఖాళీ చేయించారు . అగ్ని ప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా.. షోరూమ్‌లోని వాహనాలన్నీ దగ్ధమయ్యాయని.. భారీగా ఆస్తి నష్టం కలిగిందని షోరూమ్ యజమానులు తెలిపారు.

చురకలు

మంగళవారం 28 ఏప్రిల్ 2026



సంపాదకీయం

# శాంతి చర్చల పేరుతో దొంగాట!

ప్రపంచం శాంతిగా ఉండడం అటు అమెరికాకుకు, ఇటు ఇజ్రాయిల్‌కు ఇష్టం లేనట్లుగా ఉంది. తానో శాంతి కాముకుడినని చెప్పుకున్న ట్రంప్ చేస్తున్న చర్యలు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్ని అశాంతిలోకి నెట్టాయి. దాదాపు రెండు నెలలు కావస్తుందో. ఇరాన్‌పై దాడిని ప్రారంభించిన ఫిబ్రవరి 28 నుంచి ఎప్రిల్ 28 వరకు ..పరిస్థితులు గమనిస్తూ ఇద్దరూ రావణ కుంభకర్ణుల్లా ప్రపంచం మీద విరుచుకు పడుతున్నారు. ఇరాన్ ప్రత్యక్షంగా మిగతా దేశాలు పరోక్షంగా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అయినా రక్తం మరిగిన పులిలా ఈ ఇద్దరూ తమ పంతాన్ని వీడడం లేదు. యుద్ధ ముగింపు కోసం ఆడుతున్న నాటకాలు ప్రజలు గమనిస్తు న్నారు. శాంతి చర్చల పేరిట ఇరాన్‌ను గుప్పిట పెట్టుకోవాలని చూస్తున్నారు. గల్ఫ్ చమురు ఉత్పత్తిలో ఎదురవుతున్న అంతరాయం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను కుదిపేస్తోంది. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు తలెత్తడానికి ముందు ఉత్పత్తి అయిన ముడి చమురుతో పోలిస్తే రోజుకు సుమారు 14.5 మిలియన్ బ్యారల్స్ ఉత్పత్తి నిలిచిపోయింది. అంటే ఘర్షణకు ముందు జరిగిన ఉత్పత్తిలో 57 శాతం పడిపోయిందని తెలుస్తోంది. పనిలోపనిగా భారత్ చైనాలను నరక కూపాలని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన మూర్ఖత్వాన్ని బయటపెట్టాయి. ఇరాన్‌పై ఒత్తడి పెంచడం తప్ప ఇప్పటి వరకు జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. రసాయన ఆయుధాలు ఉన్నాయని గతంలో ఇరాక్‌పై దాడి చేసి, ఇరాక్ అధ్యక్షుడు సద్దం హుస్సేన్‌ను బలి తీసుకున్నారు. అక్కడ రసాయన ఆయుధాలు లేవని తేలింది. ఇప్పుడు ఇరాన్‌లో యురేనియం ఉందని, అణ్వాయుధాలు ఉన్నాయని బుకాయించి ఇరాన్‌పై పనిగట్టుకుని దాడి చేశారు. దేశాధినేత ఖమేనని మట్టుపెట్టారు. రెండు నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడ్డా పట్టించుకోవడం లేదు. స్వదేశంలో ట్రంప్‌కు విపరీతమైన వ్యతిరేకత వస్తున్నా లెక్క చేయడం లేదు. ఈ క్రమంలో ఇస్లామాబాద్ వేదికగా శాంతి చర్చలు ముందుకు సాగడం లేదు. అమెరికా, ఇజ్రాయిల్ డబుల్‌గేమ్ ఆడుతున్నాయనే చర్చ నడుస్తోంది. ఓ వైపు శాంతి చర్చలంటూ దౌత్యం నడుపుతూ.. మరోవైపు అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల్ని మెహరింప జేస్తోంది. హర్మ్యూజ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేస్తోంది. ఇరాన్‌ను దిగ్బంధించే యత్నాలను యానుకో లేదు. ఇరాన్, అమెరికా మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరినా, కొన్ని విషయాలు ఒప్పందానికి అడ్డంకిగా మారాయని తెలుస్తోంది. ముఖ్యంగా 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధిని నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్‌ను ఇరాన్ అంగీకరించాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఇదే అంశంపై విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయకూడదన్నదే తమ ఏకైక లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా, ఇజ్రాయిల్ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుకుపడుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. శాంతి చర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన పాక్ ప్రధానితో చెప్పినట్లు ఓ మీడియా వెల్లడించింది. ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించడం అసాధ్యమని పేజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షలను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్న తన షరతును ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఇరాన్ తమను టెలిఫోన్‌లో సంప్రదించవచ్చునని, వారు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మాట్లాడవచ్చునని ట్రంప్ చెప్పారు. హోర్ముజ్ జలసంధి నుంచి మందుపాతరలను తొలగించే పనిలో అమెరికా నౌకాదళం నిమగ్నమైందని ట్రంప్ తెలిపారు. ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఇప్పటికే తాము ఒక ఫ్రేమ్ వర్క్‌ను పాకిస్తాన్‌కు అందించామని తెలిపారు. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఇది ఒక మంచి మార్గమని ఆయన చెప్పారు. శాంతి చర్చలపై అమెరికాకు నిజంగా ఆసక్తి ఉందా అన్నది అనుమాన మేనని కూడా అన్నారు. ఇకపోతే త్తిడి, బెదిరింపు, స్వాధీనాల నడుమ ఒప్పందం ఎలా సాధ్యపడుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రశ్నించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో జరిపిన టెలిఫోన్ సంభాషణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారని ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ తెలిపింది. చర్చలు, కాల్పుల విరమణ సందర్భాల్లో అమెరికా పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నదని, నిర్బంధాలకు తెగబడుతోందని ఆయన అన్నారు. ఇరాన్ ఓడరేవులపై నిషేధం కాల్పుల విరమణ అవగాహనకు తూట్లు పొడవడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ శుద్ధి చేసిన 400 కిలోల యురేనియంను తనకు అప్పగించాలని అమెరికా కోరుతుండగా ఇరాన్ ససేమిరా అంటోంది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా ఆంక్షలు ఎత్తివేసే వరకూ హోర్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ఇరాన్ తేల్చి చెప్పింది. ఒప్పందం కుదిరే వరకూ నిర్బంధం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. మొత్తంగా చర్చల పీటముడి వీడేలా లేదు. ప్రపంచం ప్రశాంతంగా నిద్రపోయేలా కూడా లేదు.

# ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి రాజముద్ర

- వీరంతా బీజేపీలో చేరినట్లుగా గుర్తించిన ఛైర్మన్
- రాజ్యసభలో 113కు చేరిన బీజేపీ సంఖ్యాబలం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమవ్వడానికి రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాజ్యసభలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ విలీనంతో బీజేపీ సంఖ్యాబలం 113కి పెరిగింది. ఆప్ సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆప్ నుంచి రాఘవ్ చద్దా, సాందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతీ మాలివాల్ సహా ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలోకి ఫిరాయించారు. వీరి విలీనానికి రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం తెలపడంతో వారంతా బీజేపీ సభ్యులయ్యారు. విలీనం తర్వాత తమను బీజేపీ ఎంపీలుగానే పరిగణించాలని కోరుతూ ఈ ఏడుగురూ రాజ్యసభ ఛైర్మన్‌కు వినతి పత్రం సమర్పించారు. దానికి తాజాగా ఆమోదం లభించింది. కాగా, తమ పార్టీ నుంచి బీజేపీలోకి ఫిరాయించిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆప్ ఆదివారం రాజ్యసభ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించింది. కేంద్ర సంస్థలను ఉపయోగించి తమ నాయకులను ఒత్తిడి చేసి బీజేపీలోకి చేర్చుకున్నారని ఆరోపించింది. ఈ అంశంపై చట్టపరమైన పోరాటం కూడా కొనసాగుతుందని తెలిపింది. ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలు ఇటీవల బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ విలీన ప్రక్రియను సోమవారం రాజ్యసభ ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించారు. దీంతో రాజ్యసభ వెబ్‌సైట్ ప్రకారం.. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇక బీజేపీ సంఖ్య 106 నుంచి 113కు చేరింది. ఇక రాజ్యసభలో ఎన్డీఏ బలం ఇప్పుడు 141 నుంచి 148కి పెరిగింది. దీంతో రాజ్యసభలో మెజారిటీ మార్క్ అయిన 123 సంఖ్యకు బీజేపీ చేరువు అవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో చేరినట్లు ఆమ్ ఆద్మీ పార్టీలు సమర్పించిన విలీన లేఖపై రాజ్యసభ ఛైర్మెన్ రాధాకృష్ణన్ న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏడుగురు ఆప్ ఎంపీలు ఆ లేఖపై సంతకం చేశారు. అయితే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీల సంఖ్యలో 2/3 మెజారిటీ ఉన్నది. దీంతో ఎంపీల విలీన ప్రక్రియకు దాదాపు క్లియరెన్స్ వచ్చేసింది. రాఘవ్ చద్దా, సందీప్ పాతక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తాలు బీజేపీలో చేరారు. ఆప్ ఎంపీలు రాసిన లేఖ రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు తగినట్లు ఉందని రాజ్యసభ్య ఛైర్మెన్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం 2/3 మెజారిటీ ఉంటే, విలీనాన్ని ఆమోదించవచ్చు. మరోవైపు ఆ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఛైర్మెన్‌ను కోరిన విషయం తెలిసిందే.

# కోర్టుపై తనకు నమ్మకం పోయింది

- అందుకే మీరు ఉన్నంత వరకు హాజరు కాను
- ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- ఈ మేరకు లేఖ విడుదలచేసిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకావడానికి ఆయన నిరాకరించారు. ఈ మేరకు ఆయన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ, కోర్టుపై తనకు 'నమ్మకం పోయిందని' సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అంతరాత్మ ప్రభోదం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. 'న్యాయం జరుగుతుందన్న ఆశలు ఆవిరయ్యాయి. అందుకే మహాత్మా గాంధీ చూపిన సత్యాగ్రహ మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నాను. వ్యక్తిగతంగా గానీ, కనీసం నా తరపు న్యాయవాది ద్వారా గానీ విచారణకు హాజరుకాను' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. అయితే, చట్టపరంగా తనకు ఉన్న హక్కుల ప్రకారం ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, సోమవారం విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు కావడంతో హైకోర్టు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు బెంగాల్ ఎన్నికల వేడి, మరోవైపు కేజ్రీవాల్ చుట్టూ తిరుగుతున్న ఈ న్యాయ వివాదాలు దేశ రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌తో పాటు ఇతర నిందితులను ట్రయల్ కోర్టు గతంలో విడుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తున్నారు. అయితే, ఈమె గతంలో కేజ్రీవాల్ అరెస్ట్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చారని, అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. ఈ కేసు నుంచి ఆమె తప్పుకోవాలని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. గత ఏప్రిల్ 20 ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ కొట్టివేశారు. 'న్యాయమూర్తుల నిజాయతీని లిటిగెంట్లు విచారించలేరు. కేవలం ఊహల ఆధారంగా రీక్యూసల్ కోరలేరు' అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఒక మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి, స్వయంగా న్యాయమూర్తికి వ్యతిరేకంగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. న్యాయవ్యవస్థపై కేజ్రీవాల్‌కు గౌరవం లేదని బీజేపీ విమర్శిస్తుంటే, తమ నాయకుడికి అన్యాయం జరుగుతోందని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు.

# మహిళా న్యాయవాదిపై భర్త కత్తితో దాడి

- సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు
- సమగ్ర దర్యాప్తునకు ఢిల్లీ పోలీసులకు ఆదేశం



కలిత బెంచ్ ముందు మాట్లాడుతూ.. 'ఓ మహిళా న్యాయవాది అతి దారుణంగా కత్తి దాడికి గురయ్యారు.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: మహిళా న్యాయవాదిపై భర్త కత్తితో దాడి చేసిన ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ ఘటనపై సంక్షిప్త విచారణ చేపట్టింది. కేసు రిజిస్టర్ చేసి సీనియర్ అధికారిణులతో దర్యాప్తు చేయించాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఎస్పీ లేదా డీఎస్పీ ర్యాంకు అధికారిణులతో మాత్రమే దర్యాప్తు చేయించాలని స్పష్టం చేసింది. బాధితురాలి తరపున అడ్వకేట్ స్నేహ అది కూడా భర్త ఆఫీస్‌లో ఆమె కత్తి దాడికి గురయ్యారు. ఆమె చికిత్స కోసం మూడు ఆస్పత్రుల దగ్గరకు వెళితే.. చికిత్స చేయడానికి ఆస్పత్రులు ఒప్పుకోలేదు' అని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. గాయపడిన బాధితురాలిని చేర్చుకునేందుకు నిరాకరించిన మూడు ఆస్పత్రుల విషయంపై కూడా దర్యాప్తునకు ఆదేశించింది. గాయపడ్డ లాయర్‌కు ఆర్థిక సాయం అందేలా చూడాలని అధికారులకు సూచించింది. తదుపరి విచారణ సమయంలో కేసు దర్యాప్తునకు సంబంధించిన వివరాలను వెల్లడించాలని తెలిపింది. కాగా, ఢిల్లీ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ మధు రాజ్‌పుత్ ఆదివారం భర్త చేతిలో కత్తి దాడికి గురయ్యారు. ఈ విషయంపై నిన్ననే చీఫ్ జస్టిస్ సూర్య కాంత్‌కు ఓ లేఖ అందింది. ఆ లేఖ అందిన వెంటనే ఆయన సుమోటో కేసు రిజిస్ట్రర్ చేయాలని ఆదేశించారు.

# పాక్ తగిన మధ్యవర్తి కాదు

## ఇరాన్ పార్లమెంట్ సభ్యుడి ఆరోపణ



**టెహ్రాన్, ఏప్రిల్ 27:** అమెరికా-ఇరాన్ మలివిడత చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ తటస్థ వైఖరితో సమర్థవంతంగా వ్యవహరించగలదా అని టెహ్రాన్ అధికారిక వర్గాల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇరాన్ పార్లమెంట్‌లో ఆ దేశ ఎంపీ, జాతీయ భద్రత విదేశాంగ విధాన కమిషన్ అధికార ప్రతినిధి అయిన ఇబ్రహీం రెజాయి మాట్లాడుతూ.. పాక్ సరైన మధ్యవర్తి కాదనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇస్లామాబాద్‌లో దౌత్యానికి అనుకూల పరిస్థితులు లేవని అన్నారు. పొరుగు దేశమైన పాకిస్థాన్ మనకు మంచి మిత్ర దేశం. కానీ అది చర్చలకు సరైన మధ్యవర్తి కాదు. మధ్యవర్తిత్వానికి అవసరమైన విశ్వసనీయత దానికి లేదు. పాక్ అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుందే కానీ.. ఆ దేశ వైఖరిని సవాలు చేయడానికి సాహసించదు. లెబనాన్ విషయంలో అమెరికా అంగీకరించలేనివిధంగా డిమాండ్లు తెర పైకి తీసుకువచ్చినప్పుడు కూడా పాక్ నేతలు అడ్డు చెప్పలేదు. మధ్యవర్తులు నిష్పక్షపాతంగా ఉండాలి కానీ.. ఒక పక్షం వైపు మొగ్గు చూపకూడదు. ఇప్పటివరకు వారి విధానం చూస్తుంటే చర్చల విషయంలో వారు నిష్పక్షపాతంగా వ్యవహరించగలరా అనే దానిపై సందేహాలు తలెత్తుతున్నాయని ఇబ్రహీం రెజాయి పార్లమెంట్‌లో పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ ల మధ్య తొలివిడత చర్చలు విఫలమైన తర్వాత మళ్లీ చర్చలు జరపాలని ఇరాన్ ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. శాంతిఒప్పందం కుదిరేవరకు ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోబోమని అమెరికా చెబుతుండగా.. దాన్ని తొలగించేవరకూ చర్చలు జరపబోమని ఇరాన్ స్పష్టం చేస్తోంది. కాగా తమ మధ్యవర్తిత్వంలో ఇరువర్గాల మధ్య పరోక్ష చర్చలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పాక్ అధికారులు పేర్కొన్నారు.

# ఫోటో జర్నలిస్ట్ రఘురాయ్ మృతికి మోడీ సంతాపం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** ప్రముఖ భారతీయ ఫోటో జర్నలిస్ట్ రఘు రాయ్ మృతికి ప్రధాని మోడీ సంతాపం ప్రకటించారు. ఆదివారం ఆయన కన్నుమూసిన సంగతి తెలిసిందే. క్యాన్సర్ మహమ్మారితో పాటు వృద్ధాప్య సంబంధిత సమస్యల కారణంగా 83 ఏళ్ల వయసులో ఆయన ప్రాణాలు కోల్పోయారు. రఘు రాయ్ మరణంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆయనకు నివాళులర్పించారు. రఘు రాయ్ భారతదేశ జీవనశైలిని తన కెమెరా ద్వారా అద్భుతంగా బంధించిన క్రియేటివ్ దిగ్గజంగా గుర్తుండిపోతారని ప్రధాని పేర్కొన్నారు. మోదీ తన పోస్టులో.. పేర్కొన్నరు. రఘు రాయ్ ఫొటోగ్రఫీలో అసాధారణమైన సున్నితత్వం, వైవిధ్యం ఉండేవి. ఆయన ఫొటోగ్రఫీ భారతదేశంలోని వివిధ జీవన పార్శ్వాలను ప్రజలకు చేరువ చేసింది. రఘు రాయ్ మరణం ఫొటోగ్రఫీ, సాంస్కృతిక ప్రపంచానికి తీరని లోటు. ఈ విషాదకర సమయంలో నా ఆలోచనలు ఆయన కుటుంబసభ్యులు, అభిమానులు, ఫోటోగ్రఫీ రంగానికి చెందిన వారితో ఉన్నాయి. ఓం శాంతి' అని రాసుకొచ్చారు. రఘు రాయ్ 1942లో పంజాబ్‌లోని ఝంగ్‌లో జన్మించారు. సివిల్ ఇంజినీరింగ్ చేసిన ఆయన 23 ఏళ్ల వయసులోనే ఫొటోగ్రఫీ వైపు వచ్చారు. 'ద స్టేట్స్‌మన్' వార్తా పత్రికలో ఫొటోగ్రాఫర్‌గా చేరారు. దాదాపు 60 ఏళ్ల పాటు ఫొటోగ్రాఫర్‌గా కొనసాగారు. ఎన్నో అద్భుతమైన చిత్రాలను ఆయన తీశారు. దేశంలో చోటుచేసుకున్న ఎన్నో ముఖ్య ఘట్టాలను, విషాదాలను తన కెమెరాతో బంధించారు. దలైలామా, మదర్ థెరీసా, సత్యజిత్ రే, హరి ప్రసాద్ చౌరాసియా, బిస్మిల్లా ఖాన్ వంటి ప్రముఖుల జీవితాల్లోని అరుదైన కోణాలను కెమెరాతో స్పృశించారు.

చురకలు



## మే 3 న నీట్ ప్రవేశ పరిక్షకు పకడ్బంది ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ హరిత

**, ఆసిఫాబాద్ టౌన్:** మే 3 న నిర్వహించే నీట్ ప్రవేశ పరిక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ హరిత ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ ద్వారా నిర్వహించే వైద్య విద్యను అబ్యాసించే విద్యార్థులకు జాతీయ,అర్హత ప్రవేశ పరిక్ష నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలలో పరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా నుండి 316 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరౌతారని తెలిపారు. పరిక్ష మధ్యాహ్నము 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పరిక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్ణిత సమయానికి ముందే పరిక్ష కేంద్రానికి చేరుకోవలన్నారు. పరిక్ష కేంద్రంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షను పటిష్ట బందోబస్తు మద్య నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

## విధులలో నిర్లక్ష్యం వహించిన పంచాయితీ కార్యదర్శి సస్పెండ్

### జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్ :**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విధులను నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని చింతలమానెపల్లి మండలం గంగాపూర్ గ్రామపంచాయతీలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారించగా, గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిసి రోడ్ల బిల్లుల చెల్లింపులలో నిర్లక్ష్యం వహించి నిధులను పనిచేసిన వారికి కాకుండా ఇతరులకు చెల్లించడం జరిగిందని నిర్ధారణ అయిందని తెలిపారు. ఈ మేరకు సదరు పంచాయతీ కార్యదర్శులు విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామపంచాయతిలో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపు, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## యజ్ఞోపవీతం సమర్పణతో బ్రహ్మోత్సవాలకు వైభవం



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండలం రాయుడుపాలెం గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు, వేదపారాయణాలు, భక్తి కార్యక్ర మాలతో ఆలయం సందడిగా మారింది. ఉత్సవాల సందర్భంగా మర్లపాడు గ్రామానికి చెందిన బర్ల వెంకటేశ్వరావు– లక్ష్మీ దంపతులు ఆదివారం స్వామి వారికి సుమారు రూ.15వేల విలువైన ముత్యాల యజ్ఞోపవీతాన్ని సమర్పించారు. వారి భక్తి సేవను ఆలయ అధికారులు, భక్తులు అభినందించారు. ఆలయ చైర్మన్ వడ్లపూడి నరసింహరావు మాట్లాడుతూ ఈనెల 28న ధ్వజారోహణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివ స్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవస్థాన అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**, కాగజ్నగర్:** కాగజ్నగర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర గీతాన్ని నాయకులు, కార్యకర్తలు సగర్వంగా ఆలపించారు. రాష్ట్ర గీతంతో కార్యక్రమ ప్రాంగణం తెలంగాణ భావోద్వేగాలతో మార్మోగింది. ఆ తర్వాత స్థానిక 'ప్రాణహిత నిలయం' వద్ద కూడా గులాబీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు ఒకరికొకరు మిఠాయిలు తినిపిం చుకుని పండుగ వాతావరణంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో సిర్పూర్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులో మౌలిక వసతులు



**ములుగు:** మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కోసం కృషి చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ అన్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో ములుగు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం బోరు తవ్వకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మార్కెట్ యార్డులో బోరు ఏర్పాటుతో అక్కడ పనిచేసే హమాలీ కార్మికులకు, రైతులకు తాగునీటి సౌకర్యం కలగడంతో పాటు ఇతర అవసరాలకు ఎంతో ఉపయో గకరంగా ఉంటుందని తెలిపారు. మార్కెట్ యార్డులో సౌకర్యాల మెరుగుదలకు మరిన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అలోత్ దేవ్ సింగ్, మార్కెట్ కమిటీ అధికారులు, హమాలీ సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### కలెక్టరేట్ ఏఓ కిరణ్ కుమార్



**ఆసిఫాబాద్ టౌన్:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన దర ఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా పరిష్కరిం చాలని జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో నమ్మకంతో ప్రజావాణికి వస్తారని, వారి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అర్జీదారులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. వాంకిడి మండలం ఇందాని గ్రామానికి చెందిన బోర్కుటే భారతి ఒంటరి మహిళా పెన్షన్ కోసం, కాగజ్‌నగర్ నౌగాం బస్తీకి చెందిన ఇమాంబీ వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన పుస్తం పూజిత మరియు ఆసిఫాబాద్ మండలం వావుడం గ్రామానికి చెందిన మడావి రాంబాయి తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. భూ సంబంధిత సమస్యలపై స్పందిస్తూ ఆసిఫాబాద్ మండలం చిర్రకుంటకు చెందిన కుమ్రం నిర్మల తన పూర్వీకుల భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేయగా, కేస్లాపూర్ గ్రామానికి చెందిన వైరాగడే లక్ష్మి తన పట్టా భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించి రైతుబంధు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. తిర్యాణి మండలం దుగ్గాపూర్ గ్రామానికి చెందిన రంగు కిరణ్ తమ భూమిని సర్వే చేయించాలని దరఖాస్తు చేశారు. అలాగే కాగజ్‌నగర్ మండలం ఈస్గాం గ్రామానికి చెందిన పరంజిత్ తనకు సదరం సర్టిఫికేట్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల సంపూర్ణ బంద్

### కలెక్టరేట్ ఎదుట డీలర్ల నిరసన




**ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌లో సోమవారం ఎరువుల దుకాణాల యజమానులు సంపూర్ణ బంద్ పాటించారు. పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలన్నీ మూసివేసి డీలర్లు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎరువుల ఉత్పత్తి మరియు సరఫరాపై అయ్యే ఎఫ్.ఓ.ఎల్ (రవాణా ఛార్జీల) భారాన్ని కంపెనీలు డీలర్లపై వేయకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఫర్టిలైజర్ అసోసియేషన్ జిల్లా సభ్యులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీలు తమ లాభాల కోసం అదనపు రవాణా భారాన్ని డీలర్ల మీద వేయడం వల్ల వ్యాపారం చేయడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా ఖర్చులను కంపెనీలే భరించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించకుంటే భవిష్యత్తులో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ నాయకులు, పట్టణ డీలర్లు అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### ఐటీడీఏ ఏపీఓ వసంత్ రావు



**ఉట్నూర్ :**
ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందుతున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరిం చేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఉట్నూర్ ఐటీడీఏ ఏపీఓ వసంత్ రావు ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ సమస్యలను ఏపీఓ దృష్టికి తీసుకెళ్లారు. జైనూర్ మండలం జాడుగుడా గ్రామానికి చెందిన సిడం దేవరావు తన ఎద్దు మరణించినందున ఆర్థిక సహాయం అందించాలని కోరగా, ఉట్నూర్ మండలం రాంజీగూడకు చెందిన సోయం జైతు తనకు రైతు భరోసా మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే నార్నూర్ మండలం తడిహత్నూర్ గ్రామానికి చెందిన పవర్ జ్యోతి తన వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. వీటితో పాటు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం ఉపాధి పథకాలు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన పలు సమస్యలపై ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఆసిఫాబాద్ :**
ఆసిఫాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగింది.అనంతరం పార్టీ జెండా ఆవిష్క రించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గత రెండున్నర దశాబ్దాలుగా తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో మరియు రాష్ట్ర పునర్ని ర్మాణంలో బిఆర్ఎస్ పార్టీ పోషించిన కీలక పాత్రను కొనియాడారు. పార్టీ సాధించిన విజయాలను గుర్తుచే సుకుంటూ, కార్యకర్తలు పార్టీ బలోపే తానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ ప్రాంగణం అంతా "జై తెలంగాణ.. జై కెసిఆర్" నినాదాలతో మార్మోగింది. ఈ సంబరాల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి తనయుడు కోవ సాయినాథ్ , ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు, గుండి సర్పంచ్ జబరి రవీందర్,మాజీ సింగిల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్, బిఆర్ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతి, కౌన్సిలర్లు చిలువేరు వెంకన్న, కుర్సెంగ బాలకృష్ణ, సర్పంచ్ బుర్స పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి , నాయకులు నిస్సార్, అన్సర్, జీవన్, సాయి శ్రవణ్, పొన్నాల నారాయణ, బలరాం నాయక్, దూడల అశోక్, ప్రేమ్ కుమార్, నారా ఆశన్న, గిరి, సిహెచ్. రవి తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ సీనియర్ సివిల్ జడ్జిగా సంకేత్ మిత్ర బాధ్యతల స్వీకరణ



**ఆసిఫాబాద్ :** స్థానిక సీనియర్ సివిల్ జడ్జిగా సంకేత్ మిత్ర బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు భువనగిరి సతీష్ బాబు మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ సమన్వయంతో కేసుల త్వరితగతిన పరిష్కారానికి న్యాయవాదులు ఎల్లప్పుడూ సహకరిస్తారని తెలిపారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి సంకేత్ మిత్ర మాట్లాడుతూ కక్షిదారులకు సకాలంలో న్యాయం అందించడమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో న్యాయవాదుల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి, సీనియర్ న్యాయవాదులు తాటిపల్లి సురేష్, ముక్త సురేష్, చంద్రకుమార్, జగన్ మోహన్ రావు, బార్ అసోసియేషన్ సభ్యులు, గుమస్తాల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ బిల్లును అడ్డుకొని మహిళా ద్రోహులుగా మిగిలారు

**ఎమ్మెల్యే హరీష్ బాబు**



**కాగజ్నగర్:** మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ పార్టీ, దాని మిత్ర పక్షాలు మహిళా ద్రోహులుగా మిగిలిపోయాయని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు విమర్శించారు. షాపూర్ నగర్లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నారీ శక్తి వందన అధినియమ్ (మహిళా రిజర్వేషన్ బిల్లు)ను పార్లమెంటులో ఏడు సార్లు ప్రవేశపెట్టినా ప్రతిసారి కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు అడ్డుకుని మహిళలకు అన్యాయం చేశాయని ఆరోపించారు. మహిళా లోకానికి జరిగిన ఈ అన్యాయాన్ని సమాజం ఎప్పటికీ మరవదన్నారు. డీలిమిటేషన్ ద్వారా చట్టసభల్లో సీట్ల పెంపుతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు సాధ్యమవుతుందని తెలిపారు. 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పానికి కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. జీఎస్డీపీని ప్రామాణికంగా తీసుకుని దక్షిణాది రాష్ట్రాలకు అధిక పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరడం హాస్యాస్పదమన్నారు. అదే విధానాన్ని తెలంగాణ అసెంబ్లీ సీట్ల కేటాయింపులో అమలు చేస్తే హైదరాబాద్కే సగం సీట్లు వెళ్తాయని, గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, అసదుద్దీన్ ఓవైసీ ఒకే భాష మాట్లాడుతున్నారని, ఇద్దరూ కలిసి ఈ బిల్లును అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలై మహిళలకు చట్టసభల్లో విస్తృత అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షులు డాక్టర్ శిల్పా రెడ్డి, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి, నాయకులు సరిత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

- రైతులు అధైర్యపడొద్దు
- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**వరంగల్:** రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని దుగ్గొండి మండల వెంకటాపురం సబ్ సెంటర్ పరిధిలో మందపల్లి రోడ్డులో తాడిచెట్ల వనం సమీపంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధరగా క్వింటాలుకు రూ.2400 అందించే విధంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మధ్యవర్తుల చేతిలో నష్టపోకుండా రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను విక్రయించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ముఖ్యంగా దుగ్గొండి మండల రైతులకు ఈ కొనుగోలు కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. సకాలంలో మొక్కజొన్న కొనుగోలు జరిగేలా అధికారులకు ఇప్పటికే సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. రైతులు తమ పంటను శుభ్రంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తీసుకురావాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల నాయకులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆఫ్టర్ కేర్ పిల్లలకు అండగా ప్రభుత్వం

- రికార్డు స్థాయిలో 1055 మందికి ధ్రువీకరణ పత్రాలు
- మీ బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా: రాష్ట్ర మంత్రి సీతక్క హామీ



**హైదరాబాద్:** ఆఫ్టర్ కేర్ పిల్లలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజా భవన్లో సోమవారం నిర్వహించిన "చైల్డ్ సేఫ్టీ – ప్రొటెక్షన్ అండ్ సే నో టు డ్రగ్స్"కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆఫ్టర్ కేర్ విద్యార్థులకు ఆధార్, ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు వంటి కీలక పత్రాలను అంద జేశారు. రాష్ట్ర చరిత్రలో రికార్డు స్థాయిలో 1055 మంది పిల్లలకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వ సంరక్షణలో ఉన్న ఆఫ్టర్ కేర్ పిల్లలు ఇకపై స్వతంత్ర జీవితంలోకి అడుగు పెడుతున్నారని పేర్కొన్నారు. వారి ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు అవసరమైన అన్ని ధ్రువపత్రాలను ప్రభుత్వం స్వయంగా అందజేస్తోందన్నారు. గతంలో సర్టిఫికెట్ల కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ సమస్యలను పూర్తిగా తొలగించామని చెప్పారు. ఈ ధ్రువపత్రాలు కేవలం కాగితాలు కావు.. ఇవే మీ భవిష్యత్తుకు బాటలు వేసే సాధనాలు" అని పేర్కొన్నారు. కుటుంబ ఆదరణ లేకపోయినా కష్టాలను అధిగమించి ఈ స్థాయికి వచ్చిన విద్యార్థులను అభినందించారు. వారి భవిష్యత్తు భద్రంగా ఉం డేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యసదుపాయం అందుతుందని, బాలల భద్రత, పునరా వాసం, విద్య, మహిళల సాధికారత కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు."ప్రతి చిన్నారి భద్రంగా ఉండాలి.. ప్రతి యువకుడు సరైన దిశలో ఎదగాలి.. ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలి.. అదే తెలంగాణను అగ్రస్థానంలో నిలబెడుతుందని తెలిపారు. మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూ చించిన మంత్రి, క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని పేర్కొ న్నారు. ఈగల్ ఫోర్స్ తరపున విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం "సే నో టు డ్రగ్స్" పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు అపర్ణ చందన, సరిత, వందన, వచన్ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి, ఈగల్ ఫోర్స్ అధికారులు గిరిధర్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



**గుడిహత్నూర్:** తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గుడిహత్నూర్ మండల కేంద్రంలో సోమవారం రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, బోథ్ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ జాదవ్ ఆదేశానుసారం కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గుడిహత్నూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు షేక్ జమీర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్ గౌడ్ లు గులాబీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ ఎగురవేసిన గులాబీ జెండా నేడు కోట్లాది తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా మారిందని పేర్కొన్నారు. ఉద్యమం నుంచి పుట్టిన బీఆర్ఎస్ పార్టీ అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనను సుసాధ్యం చేసి, రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిందని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. జెండా ఆవిష్కరణ అనంతరం మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ వేముగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- 500 ఏళ్ల నంద దీపం వెలుగులో భక్తి పారవశ్యం



**గంభీరావుపేట:** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల శ్రీ వేముగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం వేదమంత్రోచ్చరణాలతో మారుమోగగా, పండితులు శాస్త్రోక్తంగా యజ్ఞాలు నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. గ్రామస్థులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ ఆలయంలో వెలుగుతున్న నంద దీపం సుమారు 500 ఏళ్ల చరిత్ర కలిగినదిగా స్థానికులు చెబుతున్నారు. ఎన్నో ఏళ్లుగా నిరంతరంగా వెలుగుతున్న ఈ దీపాన్ని దర్శించుకోవడానికి భక్తులు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ తాగునీరు, ప్రసాదం, తదితర సదుపాయాలు కల్పించింది. ఆలయ చైర్మన్ మాట్లాడుతూ భక్తులు సౌకర్యంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని, బ్రహ్మోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

## స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్



**ములుగు:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ప్రజాభవన్లో మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క దాన కిషోర్కు అభినందనలు తెలియజేశారు. గ్రామీణాభివృద్ధి రంగంలో ఆయనకు ఉన్న అనుభవం శాఖకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా కలిసి పనిచేయాలని సూచించారు. అలాగే గ్రామీణ పేదల సంక్షేమం, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. ఈ భేటీ సందర్భంగా శాఖ అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదలపై పలు అంశాల గురించి చర్చించారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు న్యాయమైన ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఏఎంసీ వైస్ చైర్మన్ గొర్ల వెంకటప్పరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ కిశోర్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుచ్చకాయల సోమిరెడ్డి, కొప్పుల వెంకటేశ్వర రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే భరణిపాడు కాంగ్రెస్ నాయకులు నాని జంగా శ్రీనివాస రెడ్డి, వేంసూరు తహశీల్దార్ మాణికలరావు, కందుకూరు ఏఈఓతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాలి

**హన్మకొండ:** గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాలని గో ఆరాధన ఉద్యమ



ప్రతినిధులు గురిజాల శ్రీరామ్ రెడ్డి, పాలకుర్తి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గో ఆరాధన దినోత్సవం సందర్భంగా సోమవారం దామెర మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రికి పంపేందుకు వినతి పత్రాలను సమర్పించారు. డిప్యూటీ తహశీల్దార్కు వినతిపత్రాలు అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. గో సేవ కోసం కేంద్ర చట్టం తీసుకురావడంతో పాటు గో సేవా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గో పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేసి గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు జంగిలి నాగరాజు, పెరుగు కుమారస్వామి యాదవ్, ఐల నాగరాజు గౌడ్, సానబోయిన వేణు, పోటు చిరంజీవి, గట్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బీహార్ కార్మికుడు దుర్మరణం

**సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని జేవిఆర్ పార్క్ ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్కు చెందిన ఓ కార్మికుడు మృతి చెందాడు. గోద్రెజ్ కంపెనీలో తాపీ మేస్త్రిగా పనిచేస్తున్న జువాజ్ సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. జువాజ్ ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి నుంచి అశ్వరావుపేట వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చున్న జువాజ్ కిందపడగా, బస్సు అతనిపై నుంచి వెళ్లడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది.



## మిషన్ వాత్సల్యతో బాలలకు ఆర్థిక భరోసా

**జిల్లా బాలల సంరక్షణ అధికారి**




**ఆసిఫాబాద్ టౌన్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆసిఫాబాద్ లోని జనకాపూర్లోని బాల రక్ష భవన్లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'ఆఫ్టర్ కేర్ సపోర్ట్ క్యాంప్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా బాలల సంరక్షణ అధికారి (DCPO) బూర్ల మహేష్ మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం ద్వారా జిల్లాలోని అనాథ, పాక్షిక అనాథ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే పిల్లలకు నెలకు రూ. 4000 ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులను కేవలం పిల్లల విద్య, ఆరోగ్య అవసరాలకే వాడాలని, దుర్వినియోగం చేస్తే లబ్ధిని నిలిపివేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సాయం వల్ల తమ పిల్లల చదువుకు ఎంతో మేలు జరుగుతోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ తిరుపతమ్మ, ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

**చైర్పర్సన్ బండారి అనుష సతీష్**



**ఆదిలాబాద్:** మున్సిపాలిటీలో విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లు వినోద్, సదానందంలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వీధిదీపాల నిర్వహణలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లో వెలగని స్ట్రీట్ లైట్లను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా లోతట్టు ప్రాంతాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. మున్సిపల్, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులకు చైర్పర్సన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేంసూరు కేంద్రంగా సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మర్లపాడు, వెంకటాపురం, అడసర్లపాడు, కుంచపర్తి, బీరపల్లి, మొద్దులగూడెం, కందుకూరు, భరణిపాడు, దుద్దేపూడి తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణలు, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నాయకులు పార్టీ ఆవిర్భావ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ, గ్రామ శాఖ అధ్యక్షులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉత్సాహభరిత వాతావరణంలో ఈ వేడుకలు సాగాయి.

# కాజీపేట చౌరస్తా సిగ్నల్స్ వద్ద గ్రీన్ మ్యాట్ ఏర్పాటు



**హన్మకొండ:** ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కాజీపేట చౌరస్తా ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారులు ఇబ్బందులు పడకుండా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేశారు. రావుల రాకేష్ తన తండ్రి రావుల సదానందం జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టి సిగ్నల్స్ వద్ద సోమవారం గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పిట్టల వెంకన్న, ఎస్సై సంపత్తో పాటు ట్రాఫిక్, ఇతర సిబ్బంది ప్రత్యేకంగా కృషి చేశారు. వారికి 63వ డివిజన్ అధ్యక్షులు రేణికుంట్ల కళ్యాణ్ కుమార్, 47వ డివిజన్ అధ్యక్షులు గంధసిరి శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గంధసిరి శ్రీకాంత్ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు కేవలం నిబంధనలు అమలు చేయడం మాత్రమే కాకుండా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయడం, సిగ్నల్స్ వద్ద నిలిచే వాహనదారులకు వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగేలా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రె శ్రీను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గంభీరావుపేటలో స్వీయ గణన విజయవంతం

**గంభీరావుపేట:** స్వీయ గణన కార్యక్రమం ఈనెల 26 నుంచి మే 10 వరకులో భాగంగా గంభీరావుపేట మండలంలో అధికారులు సమర్థవంతంగా పాల్గొని మొబైల్ యాప్ ద్వారా స్వీయ గణనను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ, గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లుగారి పద్మ నర్సా గౌడ్, మండల సమాఖ్య వీఓలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తమ వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేసుకున్నారు. కార్యక్రమాన్ని చార్జ్ ఆఫీసర్ తహశీల్దార్ మారుతి రెడ్డి, అదనపు చార్జ్ ఆఫీసర్ ఎంపీడీఓ అనుమల్ల రాజేందర్ పర్యవేక్షించారు. స్వీయ గణన కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయడం విశేషంగా నిలిచింది.

# శవ రాజకీయాలు తగవు

- ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** రాజకీయంగా ప్రశ్నించడం సహజమని, అయితే శవ రాజకీయాలు చేయడం తగదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం డీసీసీ భవన్లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మరణించిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆర్టీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందన్నారు. కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్న నాయకులు చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. బీజేపీ నేతలు, ముఖ్యంగా బండి సంజయ్ ఆ కుటుంబానికి కనీస సహాయం కూడా చేయలేదని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి ఎలాంటి లాభం చేకూరలేదన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు 30 రోజులు కూడా ప్రభుత్వం నిలబడలేదని, తమ ప్రభుత్వం మాత్రం గంటల వ్యవధిలోనే ఆర్టీసీ కార్మికులకు అండగా నిలిచిందని తెలిపారు. చర్చల సమయంలో ప్రత్యర్థి పార్టీల రాజకీయ దురుద్దేశం బయటపడిందన్నారు. శవ రాజకీయాలు, మత రాజకీయాలు చేయడం బీజేపీకి అలవాటైందని, అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితిలో ఉన్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. మామునూరు ఎయిర్పోర్ట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం గతంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో బీజేపీ పరిస్థితి మరింత దిగజారుతుందని, "డబుల్ ఇంజన్"కాదు, ఉన్న ఇంజన్ కూడా పోతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి బీజేపీతో ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆర్టీసీ సమ్మెపై మాట్లాడితే ప్రజలు అంగీకరించరని, గతంలో వారి పాలనలో ఆర్టీసీ ఆస్తులు అమ్ముకున్నారని గుర్తుచేశారు. వరంగల్ జిల్లా ఆర్టీసీ కార్మికుల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలను మోసం చేసేలా ప్రత్యర్థి నేతలు మాట్లాడుతున్నారని, గత 20 ఏళ్లుగా జిల్లాను అభివృద్ధిలో వెనక్కి నెట్టిన నాయకులు మళ్లీ కపట వేషాలతో ముందుకు వస్తున్నారని విమర్శించారు. ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుష సతీశ్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నామని, పట్టణాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టినట్లు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుష సతీష్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ స్పూన్లు, ప్లేట్లు, గ్లాసులు, స్ట్రాలు, ప్లాస్టిక్ జెండాల వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. ప్లాస్టిక్ ద్వారా డ్రైనేజీలు పూడిపోవడమే కాకుండా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి ప్లాస్టిక్ రహిత ఆదిలాబాద్ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. హెల్త్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ బి.శంకర్ మాట్లాడుతూ పట్టణంలోని కిరాణా దుకాణాలు, హోటళ్లు, కూరగాయల మార్కెట్లలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తామని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ విక్రయించిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు షాపింగ్కు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా బట్ట సంచులు వెంట తీసుకెళ్లాలని, శుభకార్యాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లకు బదులుగా స్టీల్ పాత్రలు, విస్తరాకులు వినియోగించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ వాహనాలకు అందించి పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ పట్టణాన్ని క్లీన్ సిటీగా ముందంజలో ఉంచేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

# ఆధునిక సాగు విధానాలతో రైతులు ఆర్థికంగా ఎదగాలి



**తాండూర్:** ఆధునిక సాగు విధానాలతో రైతులు ఆర్థికంగా ఎదగాలని కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రాజశేఖర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. సాగు నీటిని ఆదా చేయడం, పంట మార్పిడి చేయడం ద్వారా చీడపీడల సమస్యలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. మన ప్రాంతానికి పత్తి, జొన్న, మొక్కజొన్న పంటలు అనుకూలమని, పత్తి తర్వాత పెసర, మినుముల వంటి పప్పుదినుసులు, కూరగాయల పంటలు సాగు చేయాలని సూచించారు. చెట్ల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, రసాయనాలను అవసరానికి తగ్గట్టుగా వాడుతూ వాటి రశీదులను భద్రపర్చాలని అన్నారు. వరిలో సన్నగింజ రకాల లక్షణాలు, పాటించాల్సిన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సాంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటలను సాగు చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని చెప్పారు. అనంతరం శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య పద్ధతులను తప్పకుండా పాటిస్తామని రైతులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రాజనరేందర్, వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేష్, నర్సాపూర్ గ్రామ సర్పంచ్ ప్రభాత్ రావు, ఉప సర్పంచ్ పర్వత రావు, పంచాయతీ కార్యదర్శి జగదీష్, గ్రామ ప్రతినిధులు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

# ఎరువుల కంపెనీలు ఆంక్షలు మానుకోవాలి




**తాండూర్:** ఎరువుల కంపెనీల యాజమాన్యాల విధానాలతో రైతులు, ఎరువుల దుకాణాల డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆంక్షలు విధించడం తక్షణమే మానుకోవాలని తాండూర్ మండల సీడ్స్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ డీలర్లు డిమాండ్ చేశారు. సోమవారం తాండూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫర్టిలైజర్ సంఘం మండల అధ్యక్షుడు బోనగిరి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బాలు ప్రసాద్ మారు, కోశాధికారి దత్తుమూర్తి మాట్లాడారు. ఎరువుల కంపెనీల తీరుకు నిరసనగా ఆల్ ఇండియా ఫర్టిలైజర్స్ అసోసియేషన్, స్టేట్ ఫర్టిలైజర్స్ అసోసియేషన్, మంచిర్యాల జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహించిన బంద్లో భాగంగా తాండూర్ మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసినట్లు తెలిపారు. ఎరువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని, మరోవైపు కంపెనీలు లింక్ ప్రొడక్టుల రూపంలో ఇతర ఉత్పత్తులను బలవంతంగా ఇవ్వడం ద్వారా రైతులపై అదనపు భారం పడుతోందన్నారు. రవాణా చార్జీలు అధికంగా ఉండటంతో ఆ నష్టం డీలర్లపై పడుతోందని పేర్కొన్నారు. ఎఫ్ఓఎల్ కింద యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ వంటి ఎరువులను లింక్ ప్రొడక్టులు లేకుండా సరఫరా చేయాలని, విత్తనాలు లేనియెడల ఎరువుల శాంపిల్స్ ఫెయిల్ అయితే కంపెనీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని, ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తాండూర్ మండల ఫర్టిలైజర్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వరంగల్:** బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని హనుమకొండ 31వ డివిజన్ దీన్ దయాల్ నగర్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత, గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ ఎగురవేసిన గులాబీ జెండా నేడు కోట్లాది తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా మారిందన్నారు. ఉద్యమం నుంచి పుట్టిన ఈ పార్టీ తెలంగాణ రాష్ట్ర సాధనలో చారిత్రక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం కృషి చేస్తోందని, కేసీఆర్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఇదిలా ఉండగా కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్), కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్), తన్నీరు హరీష్ రావు, దాస్యం వినయ్ భాస్కర్ నాయకత్వాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**తాండూర్:** మండల కేంద్రంలోని ఐబీలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐబీ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బా దత్తు మూర్తి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్ పార్టీ పోషించిన పాత్రను వివరించారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రణయ్ కుమార్, మార్కెట్ మాజీ డైరెక్టర్ గట్టు సంతోష్ కుమార్, నాయకులు దత్తాత్రేయరావు, ఎలుక రామచందర్, బోనగిరి చంద్రశేఖర్, మాసాడి శ్రీరాములు, దాగం నారాయణ, మోగిలి శంకర్, కిష్టఫర్, బోడ సతీష్, గంగారాం, సాత్ బాబా, రాము, వేల్పుల శంకర్, బాబు ఖాన్, చింటు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దామెరలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



**హన్మకొండ:** దామెర మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ అధ్యక్షులు బత్తిని రాజు యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు గండు రాము ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు బీఆర్ఎస్ పోషించిన పాత్రను నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గరిగే కల్పనా కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ పోలం కృపాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**, సిరిసిల్ల:** ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తం 225 అర్జీలు అందినట్లు తెలిపారు. వాటిని వివిధ శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల కార్యాలయానికి అత్యధికంగా 35 అర్జీలు రాగా, ఆర్డీఓ సిరిసిల్లకు 19, తహశీల్దార్ కార్యాలయం తంగళ్లపల్లికి 12, ఆర్డీఓ వేములవాడ, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాలకు 10 చొప్పున అర్జీలు అందాయి. గృహ నిర్మాణ శాఖ, తహశీల్దార్ కార్యాలయం కోనరావుపేటకు 9 చొప్పున, ఎంపీడీఓ వేములవాడకు 8, తహశీల్దార్ కార్యాలయం వేములవాడ రూరల్, విద్యాశాఖ, ఉపాధి కల్పన శాఖలకు 7 చొప్పున అర్జీలు వచ్చాయి. ఇతర శాఖలకు కూడా సమస్యలపై పలు వినతిపత్రాలు అందినట్లు తెలిపారు. అందిన ప్రతి అర్జీపై సానుకూలంగా స్పందించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# అనాథ యువతకు 'ఆఫ్టర్ కేర్'ఒక వరం

- **స్వయం సమృద్ధి దిశగా ప్రభుత్వం కీలక అడుగు: జిల్లా సంక్షేమ అధికారి మిల్కా**



**ఆదిలాబాద్:** చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ల నుంచి 18 ఏళ్లు పూర్తి చేసి బయటకు వచ్చే యువత సమాజంలో స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆఫ్టర్ కేర్'కార్యక్రమం ఒక గొప్ప వరమని జిల్లా సంక్షేమ అధికారి మిల్కా పేర్కొన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాథ యువత 18 ఏళ్లు నిండిన తర్వాత ఒంటరితనం, అభద్రతా భావానికి గురికాకుండా వారికి సామాజి కంగా, మానసిక ధైర్యాన్ని అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సొంత ఇల్లు లేని యువతీ యువకులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో సురక్షితమైన నివాస సౌకర్యం కల్పించడంతో పాటు, వారి ఆసక్తిని బట్టి వివిధ రంగాల్లో వృత్తి విద్యా శిక్షణ అందించి నైపుణ్యాలను పెంపొందిస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం యువత ఉపాధి, స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం రుణ సదుపాయాలు, ఇతర ప్రోత్సాహకాలను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, జిల్లాలోని సీసీఐల నుంచి బయటకు వచ్చిన అర్హులైన యువత, సంబంధిత స్వచ్ఛంద సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు ఆదిలాబాద్లోని జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్, టీబీ నియంత్రణ అధికారి సుమలత, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్, సైకియాట్రిస్ట్ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- **ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రుల సమీక్ష**




**ఆదిలాబాద్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ హిమాయత్నగర్లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల ఆత్మగౌరవ ప్రతీక అని పేర్కొన్నారు. నిర్మాణ ప్రక్రియలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని, లబ్ధిదారుల దరఖాస్తులను పెండింగ్లో పెట్టవద్దని స్పష్టం చేశారు. ఏ ఫైలు కూడా అధికారుల వద్ద వారం రోజులకంటే ఎక్కువ ఉండకూడదని స్పష్టం చేశారు. సిబ్బంది కొరత ఉంటే డిప్యుటేషన్పై అధికారులను నియమించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. బేస్మెంట్ స్థాయిలోనే ఇళ్ల నిర్మాణం ఆగిపోయిన నిరుపేద లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాలు, బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, హౌసింగ్ కార్పొరేషన్ నుంచి దశల వారీగా విడుదలయ్యే నిధులతో రుణాలు తీర్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీలు గడ్డం నగేష్, గడ్డం వంశీ, ఎమ్మెల్సీలు దండే విఠల్, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, రామారావు పటేల్, పాయల శంకర్, వెడ్మ బొజ్జు, పాల్వాయి హరీశ్ బాబు తదితరులు పాల్గొని జిల్లాలోని సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హరిత, నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. జిల్లాల వారీగా ఇళ్ల మంజూరు, పురోగతి, సాంకేతిక ఇబ్బందులపై సుదీర్ఘంగా చర్చించారు.

# సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**సిరిసిల్ల:** పిల్లలు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల భద్రత, డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాలను సోమవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పరికరాలు, వాలీబాల్స్ పంపిణీ చేశారు. బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 12 వరకు జిల్లా వ్యాప్తంగా పలు శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పిల్లల భద్రత, అభివృద్ధి బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనని అన్నారు. విద్యార్థులు నిర్భయంగా మాట్లాడాలని, తమకు నచ్చిన ఆటల్లో పాల్గొనాలని, ఖచ్చితంగా చదివి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. వేసవి సెలవుల్లో ఇంటి పనుల్లో తల్లిదండ్రులకు సహాయం చేయాలని తెలిపారు. డ్రగ్స్కు యువత దూరంగా ఉండాలని, వ్యసనాలకు బానిసైతే శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా నష్టపోతారని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను నమోదు చేయించాలని, కోడిగుడ్లు, బాలామృతం, పాలు వంటి పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి నెల పిల్లల ఎత్తు, బరువు కొలిచి ఎదుగుదల లోపించిన వారికి ప్రత్యేక వైద్యం అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి రజిత, తహశీల్దార్ విజయ్ ప్రకాశ్ రావు, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సర్పంచ్ సాగర్, సీడీపీఓ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో అందజేసిన కుట్టు మిషన్లను మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్టైల్ పార్కులో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళలకు కుట్టు శిక్షణ కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వారు ఎక్కడి నుంచి వచ్చారు.. ఎన్ని రోజులుగా శిక్షణ పొందుతున్నారు.. ఎలాంటి మెళుకువలు నేర్పుతున్నారనే అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తామని భరోసా ఇచ్చిన కలెక్టర్, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రామిడి లక్ష్మి, బత్తిని అశ్విని, పోతూరి లావణ్య, దొరగళ్ల ప్రేమలత, పోతూరి నిర్మల, మంద సుమలతలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను వినియోగిస్తూ యూనిఫాంలు, ఇతర దుస్తులు, ఆధునిక డిజైన్లతో డ్రెస్సులు తయారు చేసి ఆర్థికంగా రాణించాలని తెలిపారు. ఇతర మహిళలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ సంతోష్, మెప్మా ఏఓ మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ జనగణన పూర్తి చేసిన గండ్రత్ సుజాత

**ఆదిలాబాద్:** దేశాభివృద్ధిలో జనగణన కీలకపాత్ర పోషిస్తుందని, ప్రతిఒక్కరూ బాధ్యతగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత పిలుపునిచ్చారు. సోమవారం ఆదిలాబాద్లోని తన నివాసంలో ఆమె సతి సమేతంగా మొబైల్ ఫోన్ ద్వారా డిజిటల్ స్వీయ జనగణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ జనగణన ప్రక్రియ చాలా సులభంగా ఉందన్నారు. గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, నిమిషాల్లోనే మొబైల్ ద్వారా వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేసి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ వివరాలను ఆన్లైన్ పోర్టల్లో విజయవంతంగా నమోదు చేసినట్లు తెలిపారు.



## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**తాండూర్:** గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని చౌటపల్లి, రేచిని గ్రామపంచాయతీలను సందర్శించారు. చౌటపల్లి గ్రామపంచాయతీ పీఎం అజయ్ పథకానికి ఎంపికైన సందర్భంగా చేపట్టిన పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు గ్రామంలోని ప్రతి అర్హులకు అందేలా చూడాలని స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి, ప్రతి మురికి నీటి కాలువ చివరలో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. రేచిని గ్రామపంచాయతీని సందర్శించి డ్రైనేజీలు, వాటర్ పంపులు, ఇందిరమ్మ ఇళ్లను తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని కార్యదర్శికి సూచించారు. అలాగే నర్సరీ, వైకుంఠదామం, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి కె.సతీష్ కుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ కుమార్, సర్పంచులు సునీత, రాంబాయి, పంచాయతీ కార్యదర్శులు వసంత, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అజరుద్దీన్ను కలిసిన కాంగ్రెస్ నేతలు



**ఆదిలాబాద్:** ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర మంత్రి మహ్మద్ అజరుద్దీన్ను సోమవారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర లైబ్రరీ చైర్మన్ రియాజ్, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కలతో కలిసి మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి అజరుద్దీన్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధిలో కిసాన్ కాంగ్రెస్, పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషిస్తాయని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు మల్లేష్, నాయకులు మల్లెపూల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఆడే గజేందర్



**బోథ్:** కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ టీపీసీసీ నూతన అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు చర్చించారు. కార్యకర్తల మనోభావాలు, ప్రజల అభిప్రాయాలను గజేందర్ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధానంపై మహేష్ కుమార్ గౌడ్ ఆరా తీశారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను గజేందర్ ప్రస్తావించారు. పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులు, రహదారుల నిర్మాణం, నిరుద్యోగ సమస్యలపై చర్చించారు. గిరిజన ప్రాంతాలు అధికంగా ఉన్న నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆడే గజేందర్ ప్రస్తావించిన అంశాలపై టీపీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. బోథ్ నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలతో మమేకమై క్రమశిక్షణతో పనిచేయాలని గజేందర్కు సూచించారు.

## కరాటే గిన్నిస్ బుక్ రికార్డ్ పోటీల్లో నియోజకవర్గ మాస్టర్ల ప్రతిభ



**నేరడిగొండ:** హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం గిన్నిస్ ప్రపంచ రికార్డ్ ప్రతినిధి స్వప్నిల్ నేతృత్వంలో నిర్వహించిన కరాటే గిన్నిస్ బుక్ రికార్డ్ పోటీల్లో బోథ్, నేరడిగొండ మండలాలకు చెందిన కరాటే మాస్టర్లు ప్రతిభ కనబర్చారు. బోథ్ మండలానికి చెందిన కరాటే సీనియర్ మాస్టర్లు ఎస్.సురేష్, ఎల్.రాజు, అలాగే నేరడిగొండ మండలం నుంచి ఎస్.అశోక్, టి.రవి పోటీల్లో పాల్గొని విజయం సాధించినట్లు సీనియర్ మాస్టర్ సురేష్ సోమవారం విలేకరులకు తెలిపారు. పోటీల అనంతరం నిర్వాహకుల చేతుల మీదుగా విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్లు జయంత్ రెడ్డి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



# రోజూ ఉసిరి పొడిని ఇలా తినండి..

## ఎన్నో అద్భుతమైన లాభాలు కలుగుతాయి..!



చలికాలంలో ఉసిరికాయలు మనకు అధికంగా లభిస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. అందులో భాగంగానే చాలా మంది ఈ సీజన్‌లో లభించే ఉసిరికాయలను తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఇవి అత్యంత పుల్లగా ఉంటాయి. కనుక వీటితో ఊరగాయలు, పచ్చళ్లు, పులిహోర వంటివి తయారు చేస్తుంటారు. అయితే వాస్తవానికి ఆయుర్వేదంలో ఉసిరికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఉసిరిని రోజూ తీసుకోవడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. సాధారణ ఉసిరికాయలు మనకు కేవలం ఈ సీజన్‌లోనే లభిస్తాయి. కానీ ఉసిరిక పొడి మనకు మార్కెట్‌లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ఈ క్రమంలోనే రోజూ ఒక టీస్పూన్ ఉసిరిక పొడిని తింటుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. దీన్ని రాత్రి పూట ఒక టీస్పూన్ తేనెతో కలిపి తినవచ్చు. లేదా ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి తాగవచ్చు. ఇలా తీసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి.

### రోగ నిరోధక వ్యవస్థకు..

ఉసిరిక పొడిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు తగ్గిపోతాయి. ముఖ్యంగా సీజనల్‌గా వచ్చే వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉసిరిక పొడిలో పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. అందువల్ల ఉసిరిక పొడిని తింటే ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించుకోవచ్చు. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులు తగ్గిపోతాయి. దీని వల్ల క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

### కొలెస్ట్రాల్ స్థాయిలకు..

ఉసిరిక పొడిని రోజూ తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ఉసిరిక పొడిని తింటుంటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి మేలు జరుగుతుంది. గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఉసిరిక పొడి శరీరానికి చలువ చేస్తుంది. కనుక దీన్ని తీసుకుంటే శరీరంలోని వేడి తగ్గిపోతుంది. గ్లూకోజ్ మెటబాలిజం మెరుగు పడుతుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఉసిరిక పొడిలో ఉండే క్రోమియం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ నియంత్రణలో ఉంటుంది.

### జీర్ణ వ్యవస్థకు..

ఉసిరిక పొడిని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణ శక్తి పెరుగుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. శరీరంలో కొవ్వు చేరదు. మెటబాలిజం సైతం పెరుగుతుంది. దీని వల్ల కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. అలాగే చర్మానికి, శిరోజాలకు కూడా ఉసిరిక పొడి మేలు చేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి కొల్లాజెన్ ను ఉత్పత్తి చేసేందుకు సహాయం చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. యవ్వనంగా ఉంటుంది. ముడతలు పడకుండా నిరోధించవచ్చు. చర్మం కాంతివంతంగా మారుతుంది. అలాగే జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా దృఢంగా పెరిగి ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం, శిరోజాలకు అప్లై చేసే వివిధ రకాల ప్యాక్‌లలోనూ ఉసిరిక పొడిని వాడవచ్చు. ఇలా ఉసిరిక పొడి మనకు ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# బేకింగ్ సోడాతో అద్భుతమైన ఇంటి చిట్కాలు..

## దీన్ని ఇలా వాడితే అనేక అనారోగ్య సమస్యలు తగ్గుతాయి..!



బేకింగ్ సోడా గురించి అందరికీ తెలిసిందే. దీన్నే వంట సోడా అని కూడా పిలుస్తారు. వంటల్లో దీన్ని ఎక్కువగా వేస్తుంటారు. సోడియం బైకార్బొనేట్ అనే రసాయన నామంతోనూ దీన్ని పిలుస్తారు. అయితే ఇది రసాయనం అయినప్పటికీ సహజసిద్ధమైన పదార్థంగానే పనిచేస్తుంది. ఇది మన ఆరోగ్యానికి అనేక లాభాలను అందిస్తుంది. బేకింగ్ సోడాను పలు ఇంటి చిట్కాల్లో విరివిగా ఉపయోగిస్తారు. బేకింగ్ సోడాను ఉపయోగించడం వల్ల పలు అనారోగ్య సమస్యలను నయం చేసుకోవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. బేకింగ్ సోడా దాదాపుగా ప్రతి ఇంటిలోనూ ఉంటుంది. దీన్ని వాడడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. బేకింగ్ సోడాలో సోడియం అధికంగా ఉంటుంది కనుక కిడ్నీ సమస్యలు ఉన్నవారు దీన్ని వాడకూడదు. ఇక బేకింగ్ సోడాను పలు ఇంటి చిట్కాల్లో ఉపయోగిస్తే అనేక లాభాలను పొందవచ్చు.

### గ్యాస్, కడుపులో మంటకు..

గుండెల్లో మంట, కడుపులో మంట సమస్యకు బేకింగ్ సోడా అద్భుతంగా పనిచేస్తుంది. ఇందుకు గాను అర టీస్పూన్ బేకింగ్ సోడాను 120 ఎంఎల్ నీటిలో వేసి కరిగించి నెమ్మదిగా తాగాలి. దీని వల్ల పొట్టలో అధికంగా ఉత్పత్తి అయ్యే యాసిడ్ల ప్రభావం తగ్గుతుంది. గుండెల్లో, కడుపులో మంట, అజీర్తి నుంచి సత్వరమే ఉపశమనం లభిస్తుంది. అలాగే కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యకు కూడా ఇది పనిచేస్తుంది. ఇందుకు గాను ముందు చెప్పినట్లుగానే బేకింగ్ సోడాను నీటిలో కలిపి తాగాల్సి ఉంటుంది. దీని వల్ల జీర్ణాశయంలోని యాసిడ్ల ప్రభావం తగ్గుతుంది. గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్ట ఉబ్బరం తగ్గిపోతుంది. అలాగే మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ ఉన్నవారు కూడా బేకింగ్ సోడాను ఉపయోగించవచ్చు. ఇందుకు గాను అర టీస్పూన్ బేకింగ్ సోడాను ఒక కప్పు నీటిలో కలిపి ఉదయం పరగడుపునే ఈ మిశ్రమాన్ని తాగాల్సి ఉంటుంది. దీని వల్ల మూత్రంలో వచ్చే ఆమ్లాల ప్రభావం తగ్గుతుంది. మూత్రంలో మంట నుంచి ఉపశమనం పొందవచ్చు. అలాగే బ్యాక్టీరియా, ఫంగస్ వంటి ఇన్‌ఫెక్షన్లు సైతం తగ్గిపోతాయి.

### చర్మ సమస్యలకు..

వ్యాయామం చేసేవారికి బేకింగ్ సోడా ఎంతో మేలు చేస్తుంది. వ్యాయామం చేయడానికి 60 నిమిషాల ముందు బేకింగ్ సోడాను తీసుకుంటే శరీరానికి శక్తి లభిస్తుంది. ఉత్సాహంగా వ్యాయామం చేయగలుగుతారు. మరిన్ని క్యాలరీలను ఖర్చు చేయవచ్చు. ఇక బేకింగ్ సోడాకు కాస్త నీటిని కలిపి మెత్తని పేస్ట్‌లా చేసి ఆ మిశ్రమాన్ని చంకల్లో రాసుకోవాలి. ఇది సహజసిద్ధమైన డియోడరెంట్‌గా పనిచేస్తుంది. దీని వల్ల చెమట అధికంగా ఉత్పత్తి కాకుండా ఉంటుంది. చెమట దుర్వాసన రాకుండా చూసుకోవచ్చు. అలాగే బేకింగ్ సోడా, నీటి మిశ్రమాన్ని పేస్ట్‌లా చేసి రాయడం వల్ల చర్మంపై ఉండే దురదలు తగ్గిపోతాయి. పురుగులు కుట్టిన చోట రాస్తుంటే నొప్పి, మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎండ వల్ల కందిన చర్మంపై రాస్తుంటే చర్మం తిరిగి పూర్వ రూపాన్ని పొందుతుంది. చర్మ సంరక్షణకు బేకింగ్ సోడా మేలు చేస్తుంది.

### దంతాలు, నోటి ఆరోగ్యానికి..

బేకింగ్ సోడాకు నీటిని కలిపి పేస్ట్‌లా చేసి ముఖానికి ఫేస్ ప్యాక్‌లా రాయవచ్చు. దీని వల్ల ముఖంపై ఉండే మృత కణాలు తొలగిపోయి కాంతివంతంగా కనిపిస్తుంది. అదేవిధంగా గోరు వెచ్చని నీటిలో బేకింగ్ సోడాను కలిపి ఆ నీళ్లను మౌత్ వాష్‌గా కూడా ఉపయోగించవచ్చు. దీంతో నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. ఇక బేకింగ్ సోడా, నీటి మిశ్రమాన్ని పేస్ట్‌లా చేసి దాంతో దంతాలను తోముకుంటే దంతాలపై ఉండే పాచి, గార తొలగిపోయి దంతాలు తెల్లగా మారి మెరుస్తాయి. ఈ విధంగా బేకింగ్ సోడా మనకు అనేక ఇంటి చిట్కాల్లో అద్భుతంగా పనిచేస్తుంది. అయితే హైబీపీ ఉన్నవారు, గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధులు ఉన్నవారు, గర్భిణీలు బేకింగ్ సోడాను వాడకూడదు. 6 ఏళ్ల కన్నా తక్కువ వయస్సు ఉన్న చిన్నారులకు కూడా దీన్ని ఇవ్వకూడదు. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ బేకింగ్ సోడాను వాడితే అనేక లాభాలను పొందవచ్చు.



# రాత్రి పూట నిద్రించడానికి ముందు బాదంపప్పును తిని పాలను తాగండి.. ఎన్నో లాభాలు ఉంటాయి..!

ఆరోగ్యకరమైన పోషకాహారాల్లో బాదంపప్పులు ఎల్లప్పుడూ ముందుంటాయి. ఆరోగ్యకరమైన ఆహారాలు అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చే పేర్లలో బాదంపప్పు కూడా ఒకటి. బాదంపప్పు అనేక పోషకాలను కలిగి ఉంటుంది. ఈ పప్పును రోజూ తింటుంటే అనేక లాభాలను అందిస్తుంది. ఈ క్రమంలోనే బాదంపప్పును రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు, వైద్యులు కూడా సూచిస్తుంటారు. అయితే బాదంపప్పును రాత్రి పూట నిద్రకు ముందు తింటే ఎంతగానో మేలు జరుగుతుంది. ముఖ్యంగా 7 లేదా 8 బాదంపప్పులు రాత్రి పూట నిద్రకు ముందు తినాలి. అనంతరం ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలను తాగాలి. ఇలా రోజూ చేస్తుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

### మానసిక ఆరోగ్యానికి..

రోజూ రాత్రి పూట బాదంపప్పును తిని పాలను తాగడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది. మానసిక ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి. బాదంపప్పులో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. ఇది కండరాలను ప్రశాంతంగా మారుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు బాదంపప్పు తిని పాలను తాగడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. ఆ సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు. దీని వల్ల నిద్రకు ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా ఉంటుంది.

### ఎముకల దృఢత్వానికి..

బాదంపప్పులను తిని పాలను తాగితే శరీరంలో మెలటోనిన్ శాతం పెరుగుతుంది. దీని వల్ల నిద్ర చక్కగా పడుతుంది. రాత్రి పూట ఈ ఆహారాలను తీసుకుంటే మరుసటి రోజు ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. రోజంతా యాక్టివ్‌గా ఉంటారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. ఈ రెండింటిలోనూ క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. కనుక ఈ రెండింటినీ రోజూ తీసుకుంటే ఎముకలు, దంతాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కుంటాయి. ఎముకలు నిర్మాణమవుతాయి. దంతాల నొప్పి తగ్గిపోతుంది. ఈ రెండింటి మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల విటమిన్ ఇ అధికంగా లభిస్తుంది. ఇది మెదడును ఆరోగ్యంగా ఉంచుతుంది. యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తుంది. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. దీని వల్ల మెదడు కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది.

### గుండె ఆరోగ్యానికి..

ఈ రెండింటి మిశ్రమాన్ని తీసుకుంటే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. వీటి వల్ల శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు లభించి షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. దీని వల్ల డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. అయితే రాత్రి పూట నిద్రించడానికి కనీసం 30 నిమిషాల ముందు బాదంపప్పును తిని అనంతరం పాలను తాగాల్సి ఉంటుంది. పాలు అంటే అలర్జీ ఉన్నవారు సోయా పాలను తాగవచ్చు. గేద పాల కన్నా ఆవు పాలను ఇలా తాగుతుంటే ఇంకా ఎంతగానో మేలు జరుగుతుంది. ఇలా బాదంపప్పు, పాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



# కీలక మలుపులో పసిడి ధరలు

## ఈ వారం 'కేంద్ర బ్యాంకుల' నిర్ణయాలే కీలకం!

### రూ. 1.48 లక్షల దిగువకు చేరితేనే బేరిష్ ధోరణి.. విశ్లేషకుల అంచనా

### అంతర్జాతీయ పరిణామాలు, చమురు సంక్షోభంపై ఇన్వెస్టర్ల కన్ను

( బిజినెస్ డెస్క్):

బంగారం మార్కెట్ ప్రస్తుతం ఒక కీలకమైన మలుపు వద్ద ఉన్నట్లు కనిపిస్తోంది. గత కొన్ని రోజులుగా భారీ హెచ్చుతగ్గులకు లోనైన పసిడి ధరలు, ఇప్పుడు ఒక స్థిరమైన దిశ కోసం వేచి చూస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో జరగబోయే కీలక పరిణామాలు ఈ వారం బంగారం గమనాన్ని శాసించనున్నాయని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విశ్లేషణ వెల్లడించింది. ముఖ్యంగా యూఎస్ ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ జపాన్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వంటి ప్రధాన బ్యాంకులు తీసుకోబోయే వడ్డీ రేట్ల నిర్ణయాల కోసం ఇన్వెస్టర్లు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మార్కెట్ ప్రస్తుతం ఒక ఏకీకరణ (కన్సాలిడేషన్) దిశగా వెళ్తోందని, ఏదో ఒక వైపు స్పష్టమైన బ్రేక్అవుట్ సాధిస్తే తప్ప తదుపరి దిశ వెల్లడి కాదని విశ్లేషకులు భావిస్తున్నారు.

#### ముఖ్యమైన మద్దతు మరియు నిరోధక స్థాయిలు

ప్రస్తుతం బంగారం ధరలు రూ. 1,58,000 నుండి రూ. 1,60,000 మధ్య ఉన్న ఎగువ సరఫరా జోన్ వద్ద ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దీనిని విశ్లేషకులు కేవలం ఒక తాత్కాలిక 'విరామం'గా మాత్రమే పరిగణిస్తున్నారు. ఈ వారానికి పసిడికి రూ. 1,50,500 వద్ద తక్షణ మద్దతు లభిస్తుండగా, ఒకవేళ ధరలు ఇంకా తగ్గితే రూ. 1,48,500 వద్ద బలమైన మద్దతు ఉంది. ఒకవేళ బంగారం ధర రూ. 1,48,500 కంటే దిగువకు పడిపోతే మార్కెట్ బేరిష్ ధోరణిలోకి వెళ్లి ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. అటువంటి సమయంలో కొనుగోలు చేస్తే భవిష్యత్తులో లాభాలు పొందే వీలుందని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు ధరలు పెరగడం ప్రారంభమైతే రూ. 1,55,500 వద్ద మొదటి నిరోధకతను ఎదుర్కొంటాయి. ఒకవేళ ధర రూ. 1,58,000 స్థాయిని దాటి నిలకడగా కొనసాగితే, మళ్లీ బుల్లిష్ ధోరణి ప్రారంభమై కొత్త రికార్డులను సృష్టించే అవకాశం ఉంది.

#### గ్లోబల్ మార్కెట్ల ప్రభావం

అమెరికా నుండి వెలువడనున్న వినియోగదారుల విశ్వాసం, జీడీపీ, ద్రవ్యోల్బణం మరియు మన్నికైన వస్తువుల ఆర్డర్ల డేటా కూడా మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. వీటికి తోడు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా హార్ముజ్ జలసంధి వ్యవహారం మరియు చమురు ధరల పెరుగుదల వంటివి ఇన్వెస్టర్లను సురక్షితమైన పెట్టుబడిగా ఉన్న బంగారం వైపు మళ్లించే అవకాశం ఉంది. ఈ వారం వెలువడే ఆర్థిక గణాంకాలు, కేంద్ర బ్యాంకుల నిర్ణయాలే పసిడి కాంతిని నిర్ణయించనున్నాయి. అయితే మార్కెట్ ఒడిదుడుకుల దృష్ట్యా ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల





# మళ్లీ ముడి చమురు సెగలు

- 107 డాలర్లకు చేరిన బ్రెంట్ క్రూడ్!
- నాలుగో త్రైమాసికంలో మరింత భారంగా ధరలు..
- గోల్డ్‌మన్ శాక్స్ అంచనా
- లాభాల్లో ప్రారంభమైన దేశీయ మార్కెట్లు.. నిఫ్టీ 24 వేల పైన ట్రేడింగ్

( బిజినెస్ డెస్క్)

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మరోసారి ఆందోళన కలిగిస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు మరియు చమురు ఉత్పత్తిలో తగ్గుదల ప్రభావం ధరలపై స్పష్టంగా కనిపిస్తోంది. ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్ విశ్లేషణ ప్రకారం చమురు ధరలు నాలుగో త్రైమాసికంలో మరింత పెరిగే అవకాశం ఉంది. బ్రెంట్ చమురు 90 డాలర్ల వద్ద, డబ్ల్యూటీఐ 83 డాలర్ల వద్ద ఉండొచ్చని అంచనా వేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు ఈ అంచనాలను మించిపోతున్నాయి. పశ్చిమాసియా సంక్షోభానికి తోడు శుద్ధి చేసిన చమురు ఉత్పత్తుల ధరలు భారీగా ఉండటం కూడా ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని బ్యాంక్ ప్రతినిధులు పేర్కొన్నారు.

తాజా ట్రేడింగ్‌లో ముడి చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఏకంగా 2 శాతం ఎగబాకి 107.49 డాలర్లకు చేరింది. ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత నమోదైన అత్యధిక ధర ఇదే కావడం గమనార్హం. అటు అమెరికాకు చెందిన వెస్ట్ టెక్సస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) కూడా 1.77 డాలర్లు పెరిగి 96.17 డాలర్ల వద్ద కొనసాగుతోంది. పశ్చిమాసియా సంక్షోభం ఇంధన సరఫరాకు పెద్ద షాక్‌గా మారుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం ఆరంభంలో లాభాల బాట పట్టాయి. సోమవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ఇన్వెస్టర్లు కొనుగోళ్లపై మొగ్గు చూపారు. సెన్సెక్స్ ఉదయం 9:19 గంటల సమయానికి 392 పాయింట్లు వృద్ధి చెంది 77,056 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 126 పాయింట్లు లాభపడి కీలకమైన 24,024 మార్కు పైన కొనసాగుతోంది. అయితే స్టాక్ మార్కెట్లు లాభాల్లో ఉన్నప్పటికీ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మాత్రం ఒత్తిడికి లోనవుతోంది. నేటి ట్రేడింగ్‌లో రూపాయి విలువ మరో 11 పైసలు క్షీణించి రూ. 94.27 వద్ద ట్రేడవుతోంది. చమురు ధరల సెగలు భారత కరెన్సీపై ఈ

# బ్యాంకింగ్‌లో టెక్నాలజీ విప్లవం




- యాక్సిస్ బ్యాంక్‌లో తగ్గిన ఉద్యోగుల సంఖ్య
- ఏడాది కాలంలో 3 వేల మంది కోత..
- టెక్ పెట్టుబడులతో పెరిగిన ఉత్పాదకత

( బిజినెస్ డెస్క్):

బ్యాంకింగ్ రంగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ఆటోమేషన్ ప్రభావం ఉద్యోగాల స్వరూపాన్ని మార్చేస్తోంది. దేశీయ ప్రైవేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్‌లో గత ఏడాది కాలంగా ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గడం ఇప్పుడు కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2025 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 1.04 లక్షలుగా ఉన్న బ్యాంక్ మొత్తం వర్క్‌ఫోర్స్, 2026 ఆర్థిక సంవత్సరం చివరికి 1.01 లక్షలకు పరిమితమైంది. అంటే సుమారు 3,000 మంది ఉద్యోగులు తగ్గగా, ఇది దాదాపు 3 శాతం తగ్గుదలగా నమోదైంది. అయితే ఇది ఏదో పెద్ద రీస్ట్రక్చరింగ్ ప్రక్రియలో భాగంగా జరిగింది కాదని, గత కొన్నేళ్లుగా టెక్నాలజీపై పెట్టిన పెట్టుబడుల వల్ల వచ్చిన ఫలితమని బ్యాంక్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

#### పెరిగిన పని సామర్థ్యం.. తగ్గిన అవసరం

బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీఈఓ అమితాభ్ చౌదరి వెల్లడించిన వివరాల ప్రకారం, గత మూడు నాలుగు సంవత్సరాలుగా బ్యాంక్ తన నిర్వహణ వ్యయంలో సుమారు 9 నుండి 10 శాతాన్ని కేవలం సాంకేతికతపైనే ఖర్చు చేస్తోంది. ఈ భారీ పెట్టుబడుల వల్ల సిస్టమ్స్ మెరుగుపడటంతో పాటు ఆటోమేషన్ ప్రక్రియ వేగవంతమైంది. దీనివల్ల గతంలో కంటే తక్కువ సమయంలోనే ఉద్యోగులు ఎక్కువ పనిని పూర్తి చేయగలుగుతున్నారు. ఫలితంగా ఉత్పాదకత పెరిగి కొత్తగా ఉద్యోగులను నియమించుకోవాల్సిన అవసరం తగ్గింది. ఈ మార్పు కేవలం ఏదో ఒక విభాగానికి మాత్రమే పరిమితం కాకుండా బ్యాంక్ అంతటా సమగ్రంగా చోటుచేసుకోవడం గమనార్హం. ఒకవైపు ఉద్యోగుల సంఖ్య తగ్గినప్పటికీ, మరోవైపు గడిచిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ దేశవ్యాప్తంగా సుమారు 400 కొత్త బ్రాంచ్‌లను ప్రారంభించి తన నెట్‌వర్క్‌ను విస్తరించింది.

#### ఏఐ పాత్రపై స్పష్టత

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగాలను భర్తీ చేస్తుందా అన్న ఆందోళనలపై బ్యాంక్ యాజమాన్యం స్పష్టతనిచ్చింది. ప్రస్తుతం ఏఐ సాంకేతికతను ప్రధానంగా ప్రక్రియలను వేగవంతం చేయడానికి మరియు లావాదేవీల సమయాన్ని తగ్గించడానికి మాత్రమే ఉపయోగిస్తున్నామని, ఉద్యోగుల స్థానాన్ని భర్తీ చేయడం తమ ప్రాధాన్యత కాదని స్పష్టం చేసింది. రాబోయే 18 నుండి 24 నెలల్లో డిజిటల్ టెక్నాలజీ వినియోగం మరింత పెరగడం ద్వారా బ్యాంకింగ్ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా మారుతాయని బ్యాంక్ అంచనా వేస్తోంది. టెక్నాలజీ వల్ల కలిగే ప్రయోజనాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని బ్యాంక్ ధీమా వ్యక్తం చేస్తోంది.

#### స్థిరంగా ఆర్థిక ఫలితాలు

బ్యాంక్ ఆర్థిక పనితీరు విషయానికి వస్తే మార్చి త్రైమాసికంలో ఫలితాలు స్థిరంగా నమోదయ్యాయి. ఈ త్రైమాసికంలో యాక్సిస్ బ్యాంక్ రూ. 7,071 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ. 7,117 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు సమానంగా ఉంది. ఈ సందర్భంగా 2026 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ తన వాటాదారులకు ప్రతి షేరుకు రూ. 1 డివిడెండ్ ప్రకటించింది. టెక్నాలజీ రంగంలో చేస్తున్న మార్పులు దీర్ఘకాలంలో బ్యాంక్ లాభదాయకతను మరింత పెంచుతాయని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

# అమెరికా గడ్డపై భారత ఫార్మా జెండా

- లక్ష కోట్లతో 'ఆర్గానన్'ను దక్కించుకున్న సన్ ఫార్మా!
- ఒక్క రోజే రూ. 35 వేల కోట్లు పెరిగిన కంపెనీ విలువ.. రాకెట్‌లా దూసుకెళ్లిన షేర్లు
- బిలియనీర్ల జాబితాలో దిలీప్ సంఘ్వీ జోరు.. గ్లోబల్ మార్కెట్‌లో సరికొత్త చరిత్ర

( బిజినెస్ డెస్క్):

భారతీయ ఫార్మా రంగ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం లిఖించబడింది. దేశీయ ఫార్మా దిగ్గజం సన్ ఫార్మా (రాబఅ రాష్ట్రుతీఖ్రు) అంతర్జాతీయ స్థాయిలో తన ఉనికిని చాటుకుంటూ అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ 'ఆర్గానన్'ను సుమారు రూ. 1,00,000 కోట్లకు (11.75 బిలియన్ డాలర్లు) కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మెగా డీల్ వార్త బయటకు రావడంతో సోమవారం స్టాక్ మార్కెట్‌లో సన్ ఫార్మా షేర్లు ఇన్వెస్టర్ల కొనుగోళ్లతో రాకెట్‌లా దూసుకుపోయాయి. గతంలో రాన్‌బాక్సీని కొనుగోలు చేసి సంచలనం సృష్టించిన సన్ ఫార్మాకు, తాజా ఆర్గానన్ డీల్ అంతర్జాతీయ ఫార్మా మార్కెట్‌లో తిరుగులేని పట్టును అందించనుందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



#### మార్కెట్‌లో సన్ ఫార్మా హవా

భారీ కొనుగోలు ఒప్పందం నేపథ్యంలో సోమవారం ట్రేడింగ్‌లో సన్ ఫార్మా షేర్లు ఇన్వెస్టర్లను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఉదయం రూ. 1632.50 వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైన షేర్ విలువ, మధ్యాహ్నం సమయానికి ఏకంగా 9 శాతం లాభపడి రూ. 1,766.65 గరిష్ఠ స్థాయిని తాకింది. మార్కెట్ ముగిసే సమయానికి దాదాపు 7 శాతం లాభంతో రూ. 1,733.15 వద్ద స్థిరపడింది. షేర్ల ధర పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువ కూడా అనూహ్యంగా పెరిగింది. గత వారం ముగింపు సమయానికి రూ. 3,88,715.97 కోట్లుగా ఉన్న కంపెనీ మొత్తం విలువ, సోమవారం నాటికి ఏకంగా రూ. 4,23,917.44 కోట్లకు చేరింది. అంటే కేవలం ఒక్క రోజులోనే కంపెనీ సంపదలో రూ. 35,201.47 కోట్ల పెరుగుదల కనిపించడం విశేషం.

#### సంపన్న జాబితాలో సంఘ్వీ జోరు

కంపెనీ షేర్లు దూసుకుపోవడంతో సన్ ఫార్మా వ్యవస్థాపకుడు మరియు ఎండీ దిలీప్ సంఘ్వీ వ్యక్తిగత సంపద కూడా భారీగా పెరిగింది. ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్స్ గణాంకాల ప్రకారం, ఆయన నికర ఆస్తి విలువ ఒక్క రోజులోనే 1.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 15 వేల కోట్లు) పెరిగి మొత్తం 24.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అమెరికా మార్కెట్‌లో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి, మహిళా ఆరోగ్యం మరియు బయోసిమిలర్స్ వంటి కీలక విభాగాల్లో పట్టు సాధించడానికి ఈ లక్ష కోట్ల రూపాయల డీల్ సన్ ఫార్మాకు అత్యంత కీలకం కానుంది. కొత్త ఉత్పత్తుల తయారీ మరియు గ్లోబల్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ విస్తరణకు ఈ ఒప్పందం ఎంతో మేలు చేస్తుందని






# 100 ఇస్తేనే సెల్ఫీ దిగుతా..

## చిన్నారులతో వైభవ్ సూర్యవంశీ సరదా ప్రాంక్

వైభవ్ సూర్యవంశీ.. సంచలన ప్రదర్శనలు చేస్తూ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఐపీఎల్ 2026లోనూ దూకుడుగా ఆడుతూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. 15 ఏళ్ల వైభవ్ కూడా గ్రౌండ్‌లో అల్లరి పనులు చేస్తూ సరదాగా ఉంటాడు. ఈ క్రమంలో వైభవ్ సూర్యవంశీకి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తనతో సెల్ఫీ దిగడానికి వచ్చిన చిన్నారులను ఆటపట్టిస్తూ వైభవ్ ప్రాంక్ చేశాడు. ఈ వీడియోను రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో రాజస్థాన్ రాయల్స్ తలపడనుంది. అందుకోసం ఆర్ఆర్ టీమ్ ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ చేరుకుంది. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్‌లో వైభవ్ సూర్యవంశీని చూసేందుకు చిన్నారులు వచ్చారు. అతడితో సెల్ఫీ దిగడానికి ప్రయత్నించారు. ఇంతలో వైభవ్.. 'బ్రదర్.. నేను మీకు ఫొటో ఇవ్వాలంటే ఖర్చు అవుతుంది. నేను సీరియస్‌గానే చెబుతున్నా. డబ్బులు ఇస్తేనే ఫొటో దిగుతా' అని అన్నాడు. దీంతో ఆ చిన్నారులకు ఆశ్చర్యపోయి ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోబోతుండగా.. వారిని ఆపిన వైభవ్ 'నేను ఒక్కోదానికి రూ.100 తీసుకుంటా. మీ దగ్గర ఎంత ఉందో చెప్పండి' అని అడిగాడు. అందులోని ఓ పిల్లాడు 'నా దగ్గర రూ.200 ఉంది' అని వైభవ్ సూర్యవంశీకి ఇవ్వబోయాడు. వెంటనే నవ్వేసిన వైభవ్.. ఇదంతా ప్రాంక్ అంటూ వారిని ఆటపట్టించాడు. ఆ తర్వాత ఆ పిల్లలతో ఫొటోలు దిగాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది.




# ఉక్రెయిన్‌పై విజయం

## సజీవంగా క్వార్టర్స్ ఆశలు

**హోర్సెన్స్ (డెన్మార్క్):** ప్రతిష్టాత్మక ఉబర్ కప్‌లో భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు అదరగొట్టింది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య డెన్మార్క్‌తో ఓడినా తమ రెండో మ్యాచ్‌లో 4-1తో ఉక్రెయిన్‌పై ఏకపక్ష విజయం సాధించి క్వార్టర్స్ ఆశలు సజీవంగా నిలుపుకుంది. గ్రూప్-ఏ పోరులో భాగంగా మహిళల సింగిల్స్‌లో యువ సంచలనాలు ఉన్నతి హుడా, తన్వి శర్మ, దేవికా సిహాగ్ సత్తాచాటి భారత్‌కు విజయాన్ని అందించారు. మొదట ఉన్నతి.. 21-19, 22-20తో పొలిన బఃహోవాను చిత్తుచేసి భారత్‌కు శుభారంభాన్ని అందించింది. అదే ఊపులో తన్వి.. 21-12, 17-21, 21-10తో యెవెనిలను ఓడించింది. మూడో సింగిల్స్‌లో దేవికా.. 23-21, 21-13తో మరియా స్టొలిరెంకొపై అలవోకగా నెగ్గి ఆధిక్యాన్ని 3-0కు తీసుకెళ్లింది. డబుల్స్‌లో కవిప్రియ-సిమ్రన్ ద్వయం 11-21, 17-21తో బఃహోవా-యెవెనిల చేతిలో ఓడింది. కానీ రెండో డబుల్స్‌లో తనీషా.. సీనియర్ షట్లర్ పీవీ సింధుతో కలిసి 21-18, 21-15తో సోఫియా, స్టొలిరెంకొను మట్టికరిపించింది.




# 10 గంటల్లో 59 కిలోమీటర్లు ఈది

**కాచిగూడ:** బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన అంతర్జాతీయ స్విమ్మర్ గంధం క్వీనీ విక్టోరియా మరో రికార్డును నెలకొల్పారు. శ్రీలంకలోని తలైమీనార్ నుంచి రామేశ్వరం ధనుష్కోడి (తమిళనాడు) వరకు ఐదుగురు మహిళలతో సముద్రాన్ని ఈది రికార్డు నమోదు చేసుకున్నారు.యూనిఫ్లై సంస్థ, స్విమ్‌లైఫ్ సహకారంతో ఓడబ్ల్యూఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు సతీశ్‌కుమార్ పర్యవేక్షణలో ఈ ఐదుగురు.. రికార్డు సృష్టించారు. క్వీనీ విక్టోరియా సారథ్యంలో న్యూఢిల్లీకి చెందిన ఆర్సీ, మౌనిక (తెలంగాణ), స్మిత (మహారాష్ట్ర), ధాత్రిక మండవ (విజయవాడ) బృందం శ్రీలంకలోని తలైమీనార్‌లో ఆదివారం తెల్లవారుజామున రెండు గంటలకు స్విమ్మింగ్ ప్రారంభించి మధ్యాహ్నం 12.10 నిమిషాలకు తమ గమ్యాన్ని చేరుకున్నారు. 59 కిలోమీటర్ల దూరాన్ని 10 గంటల 10 నిమిషాల్లోనే పూర్తిచేసి రికార్డు సాధించారు.

# ఢిల్లీ డీలా

# బెంగళూరు బల్లే బల్లే!




## ఎనభై ఒక్క బంతులు మిగిలి ఉండగానే ఆర్సీబీ ఘన విజయం

- పేకమేడలా కుప్పకూలిన ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్
- నాలుగు వికెట్లతో చెలరేగిన ఆసీస్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్
- స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్ మని ఊదేసిన బెంగళూరు బ్యాటర్లు
- పడిక్కల్, కోహ్లీ మెరుపు ఇన్నింగ్స్.. సొంతగడ్డపై ఢిల్లీకి పరాభవం



**ఢిల్లీ :** అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బౌలర్ల ధాటికి ఢిల్లీ బ్యాటర్లు విలవిలలాడారు. ఫలితంగా బెంగళూరు జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఏకపక్ష విజయాన్ని నమోదు చేసి పాయింట్ల పట్టికలో సత్తా చాటింది. బౌలింగ్‌లో హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ నిప్పులు చెరిగారు. బ్యాటింగ్‌లో పడిక్కల్, కోహ్లీ చెలరేగడంతో మ్యాచ్ వన్ సైడ్ గా మారిపోయింది.

### ఢిల్లీ ఇన్నింగ్స్.. పేకమేడలా..

సొంత మైదానంలో టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు బెంగళూరు బౌలర్లు చుక్కలు చూపించారు. పిచ్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకున్న ఆర్సీబీ బౌలింగ్ దళం.. ఢిల్లీ ఇన్నింగ్స్‌ను కకావికలం చేసింది. కేవలం 16.3 ఓవర్లలోనే 75 పరుగుల అత్యల్ప స్కోరుకు ఢిల్లీ జట్టును ఆలౌట్ చేశారు. ఢిల్లీ బ్యాటర్లలో అభిషేక్ పోరెల్ 33 బంతుల్లో 30 పరుగులు చేసి కాసేపు ఒంటరి పోరాటం చేశాడు. అతనికి తోడుగా డేవిడ్ మిల్లర్ 18 బంతుల్లో 19 పరుగులు, కైల్ జేమీసన్ 13 బంతుల్లో 12 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ కే పరిమితమై పెవిలియన్ కు క్యూ కట్టారు. బెంగళూరు బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ 3.3 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 12 పరుగులు ఇచ్చి ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఇక భువనేశ్వర్ కుమార్ మూడు ఓవర్లలో ఐదు పరుగులే ఇచ్చి మూడు వికెట్లు తీసి ఢిల్లీ నడ్డి విరిచాడు. సుయాష్ శర్మ ఒక వికెట్ తీశాడు.

### చెలరేగిన పడిక్కల్, కోహ్లీ..

76 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు బ్యాటర్లు ఎక్కడా తడబడలేదు. ఓపెనర్ జాకబ్ బెతెల్ 11 బంతుల్లో 20 పరుగులు చేసి ధాటిగా ఆడే ప్రయత్నంలో జేమీసన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, దేవ్ దత్ పడిక్కల్ వినాశకర బ్యాటింగ్‌తో చెలరేగారు. ఢిల్లీ బౌలర్లపై బౌండరీల వర్షం కురిపించారు. ముఖ్యంగా పడిక్కల్ ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. కేవలం 13 బంతుల్లోనే అజేయంగా 34 పరుగులు చేయగా.. కోహ్లీ 15 బంతుల్లో 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో కేవలం 6.3 ఓవర్లలోనే ఒక వికెట్ నష్టపోయి 77 పరుగులు చేసిన బెంగళూరు.. ఇంకా 81 బంతులు మిగిలి ఉండగానే అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ఢిల్లీ బౌలర్లలో కైల్ జేమీసన్ కు మాత్రమే ఒక వికెట్ దక్కింది.





# చిన్నస్వామి స్టేడియంలో భద్రతా కలకలం

- 240 సీసీటీవీ కెమెరాల ఫీడ్ కట్!
- జీతాల బకాయిల కోసం సిబ్బంది దుశ్చర్య
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆర్సీబీ - గుజరాత్ మ్యాచ్ అనంతరం వెలుగులోకి.. స్టేడియంలో హైఅలర్ట్



**బెంగళూరు:** ఐపీఎల్ 2026 సీజన్ ఉత్సాహంగా సాగుతున్న వేళ బెంగళూరులోని ప్రఖ్యాత చిన్నస్వామి స్టేడియంలో తీవ్ర భద్రతా ఉల్లంఘన చోటుచేసుకోవడం కలకలం రేపింది. 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత గతేడాది ఆర్సీబీ టైటిల్ గెలిచిన వేళ జరిగిన విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందిన ఘటన మరువకముందే, తాజాగా స్టేడియంలోని నిఘా నేత్రాలను ఇద్దరు ఉద్యోగులు ధ్వంసం చేయడం గమనార్హం. స్టేడియం భద్రతను పర్యవేక్షించే సబ్ కాంట్రాక్ట్ కంపెనీకి చెందిన మంజునాథ్, అబ్దుల్ కలామ్ అనే ఇద్దరు వ్యక్తులు కంట్రోల్ రూమ్‌లోకి అక్రమంగా ప్రవేశించి సుమారు 240 సీసీటీవీ కెమెరాల ఫీడ్‌ను నిలిపివేసినట్లు పోలీసులు గుర్తించారు. ఏప్రిల్ 24న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరియు గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్ ముగిసిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితులు కాలం చెల్లిన (డీయాక్టివేట్ చేసిన) యాక్సిస్ కార్డును ఉపయోగించి కంట్రోల్ రూమ్‌లోకి ప్రవేశించారు. అక్కడ ఉన్న సీసీటీవీ ఫైబర్ కనెక్షన్లు మరియు వీడియో రికార్డర్లను (డీవీఆర్) ధ్వంసం చేసి నిఘా వ్యవస్థను స్తంభింపజేశారు. స్టేడియం ప్రవేశ ద్వారాలు, కార్పొరేట్ స్టాండ్లు మరియు ఇతర కీలక ప్రాంతాల్లోని దృశ్యాలు కనపడకుండా చేయడంతో అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీనిపై కబ్బన్ పార్క్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, తమకు రావాల్సిన రూ. 10 లక్షల బకాయిలను యాజమాన్యం చెల్లించకపోవడంతోనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే స్పందించిన స్టేడియం అధికారులు మరియు సాంకేతిక బృందం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. బ్యాకప్ వ్యవస్థల సాయంతో ధ్వంసమైన కనెక్షన్లను సరిచేసి, రియల్ టైమ్ మానిటరింగ్‌ను తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ప్రస్తుతం స్టేడియం అంతటా నిఘా నిరంతరాయంగా కొనసాగుతోందని భద్రతా విభాగం స్పష్టం చేసింది. అయితే చిన్నస్వామి స్టేడియంలో భద్రతా లోపాలు బయటపడటం ఇదే మొదటిసారి కాదు. ఐపీఎల్ ప్రారంభమైన కొద్ది రోజులకే ఇక్కడ బ్లాక్ టికెట్ల రాకెట్‌ను పోలీసులు ఛేదించగా, ఇప్పుడు ఏకంగా స్టేడియం లోపలే నిఘా వ్యవస్థపై దాడి జరగడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

చురకలు

మంగళవారం 28 ఏప్రిల్ 2026

# శరవేగంగా కల్కి-2 షూటింగ్

## తమిళ నటుడు శింబు కూడా చేరినట్లు ప్రచారం

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసి వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. పురాణాల ఆధారంగా భవిష్యత్ నేపథ్యంలో సాగిన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'కల్కి 2'ను మరింత భారీ స్థాయిలో తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. కథను మరింత లోతుగా, భావోద్వేగపూర్వకంగా తీర్చిదిద్దేందుకు దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. మొదటి భాగంలో చూపించిన ప్రపంచాన్ని విస్తరించి, కొత్త పాత్రలు, ఆసక్తికరమైన మలుపులతో సీక్వెల్‌ను రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. తాజాగా వినిపిస్తున్న వార్తల ప్రకారం ఈ సీక్వెల్‌లో ఒక పవర్‌ఫుల్ స్పెషల్ పాత్ర ఉండబోతుందని, అది క్లైమాక్స్‌లో కీలకంగా మారుతుందని టాక్. ఆ పాత్ర కోసం తమిళ స్టార్ హీరో శింబును సంప్రదించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఈ సినిమాలో నటిస్తే తమిళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలం చేకూరే అవకాశముందని అంటున్నారు. మొదటి భాగం చివర్లో ప్రభాస్ పాత్రను కర్ణుడిగా చూపిస్తూ మేకర్స్ ఇచ్చిన ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. దీంతో సీక్వెల్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈసారి కథ ప్రధానంగా కర్ణుడి గతం, అతని గాథ, తిరిగి రావడం వంటి అంశాలపై నడుస్తుందని సమాచారం. బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆయన మళ్లీ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుండగా, బిజీ షెడ్యూల్ కారణంగా అభిమానులను కలవలేకపోయానని ఆయన తెలిపారు. ప్రభాస్ కూడా త్వరలో షూటింగ్‌లో చేరనున్నారని సమాచారం.ఇక మరో ముఖ్య ఆకర్షణగా కమల్ హాసన్ కూడా ఈ సీక్వెల్‌లో కనిపించనున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కలిసి నటిస్తుండడం విశేషం. ఇక ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, జేడీ చక్రవర్తి కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో 'కల్కి 2'కు భారీ తారాగణం సిద్ధమవుతోంది.






# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్

## సాయిపల్లవి కాదు కాదు.. రుక్మిణీ వసంత్



జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి రూపొందించబోతున్న సంగీత సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి నటించబోతోందనే వార్త కొంతకాలంగా మీడియాలో చక్కర్లు కొడుతోంది. అలానే ఆమె పేరుతో పాటు నయనతార పేరు కూడా ఆ మధ్య వినిపించింది. అలా మరో ఇద్దరు ముగ్గురి పేర్లనూ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రతో ముడి పెట్టి కొందరు ప్రచారం చేశారు. అయితే ఫైనల్‌గా సాయిపల్లవి దగ్గరే అది ఆగింది. కానీ ఇప్పుడు ఆ పాత్ర సాయి పల్లవి చేజారి... రుక్మిణీ వసంత్ ను చేరిందని వార్తలు వస్తున్నాయి. సాయిపల్లవికి ఈ పాత్ర చేయాలనే కోరిక బలంగా ఉన్నా... ఇప్పటికే ఆమె కమిట్ అయిన సినిమాల కారణంగా డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఈ పాత్రను వదిలేసుకుందని అంటున్నారు. ఇదిలా ఉంటే... పలు కన్నడ, తెలుగు సినిమాలతో ఇప్పటికే దక్షిణాది సినీ అభిమానుల గుండెల్లో చోటు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'కాంతార: చాప్టర్ 1'తో రుక్మిణీ వసంత్ సైతం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె యశ్ మూవీ 'టాక్సిక్'లో నటిస్తోంది. అలానే ప్రభాస్ సరసన 'డ్రాగన్' చేస్తోంది. తమిళంలోనూ ధనుష్ మూవీలో రుక్మిణీ వసంత్ ఎంపికైందని వార్తలు వచ్చాయి. కెరీర్ మంచి ఊపు మీద ఉన్న ఈ సమయంలో ఆమె ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రను చేస్తే ఖచ్చితంగా అది ప్రాజెక్ట్‌కు ఉపయోగపడే అంశమే! అయితే రుక్మిణీ వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా నటించబోతోందనే విషయాన్ని ఇంకా అధికారికంగా మేకర్స్ ప్రకటించలేదు.





# జూన్ 25న పెద్ది విడుదల ఖాయం

## దర్శకుడు సానా బుచ్చిబాబు వెల్లడి

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదలపై క్లారిటీ వచ్చింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఫైనల్‌గా జూన్ 25న విడుదల కానుందని రెండ్రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే! అయితే దీనిపై దర్శకుడు సాన బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చారు. ధనుష్ హీరోగా నటించిన 'కర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ 'పెద్ది రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు గోల చేయగా బుచ్చి విడుదల తేదిని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ 25 సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఊరట చెందారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు దుమ్ము లేపేశాయి. త్వరలో ఓ డ్యూయెట్ రానుంది. ఆ తర్వాత శ్రుతీహాసన్, రామ్‌చరణ్‌పై చిత్రీకరిస్తున్న ప్రత్యేక గీతాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. షూటింగ్ ఆలస్య, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయం సరిపోకపోవడం వల్ల విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే.






# ధనుష్‌తో మరోమారు వెంకీ అట్లూరి జత

తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర్' చాలా నచ్చింది. మీ రాబోయే సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కు కూడా శుభాకాంక్షలు' అని అన్నారు. ధనుష్ నటించిన 'కర' సినిమా ఈ నెల 30న విడుదల కానుంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com